ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 5 ఆగస్టు 2024





కొత్త పింఛన్లు ఎప్పుడో..?

- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- దరఖాస్తు ప్రక్రియను కష్టతరం చేసిన వైసీపీ
- గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ఎంపిక

గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు నమోదు చేయించుకునే అవకాశం ఉండేది.. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇదే పెద్ద ప్రహసనంలా మారింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే నమోదుకు అవకాశం దక్కేది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో తమకు అవకాశం ఎప్పటికి దక్కుతుందో.. ఎప్పటి నుంచి పింఛన్ల లబ్ధి పొందుతామని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తోన్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశంపై కొండంత ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశంలేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. దానికి తోడు పింఛను మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచేసింది. మరోవైపు వైసీపీ హయాంలో నిబంధనల వడపోతతో అనర్హత బారినపడి పింఛన్లు కోల్పోయిన వేలాది మంది అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వెరసి పింఛన్ల కోసం ఎదురు చూసేవారి సంఖ్య భారీగా పెరిగింది.

నిరంతర ప్రక్రియగా నాడు నమోదు

2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానం తెచ్చింది. ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ ప్రకారం జాబితాలను రూపొందించిన దాఖలాలు లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే వైసీపీ ప్రభుత్వం తొలగింపులను నిరంతర ప్రక్రియగా చేసుకుంది. విద్యుత్, ఇన్‌కమ్ టాక్స్, నాలుగు చక్రాల వాహనం, ఇళ్ల స్థలం, పొలం తదితరాల పేరుతో వేలాదిమందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించారు. పొరపాటున తిరస్కరణకు గురైతే మరో ఆరు నెలలు ఆగాల్సి వచ్చేది. ఇలా అర్హులైన లబ్ధిదారులు వేలాది మంది ఏళ్లకు ఏళ్లు పింఛను కోల్పోయిన పరిస్థితి ఉంది. ఇలాంటి వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు.

నిర్ణయంపై ఎదురు చూపులు

కొత్త పింఛన్లపై కూటమి ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. అనేక మంది ఒక చోట నుంచి వేరొక చోటికి మారినవారు ఉన్నారు. వారు కూడా పింఛనును తాము ప్రస్తుతం నివాసం ఉండే చోటికి బదిలీ చేసుకోవాలని చూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

సమగ్రంగా సిద్ధం



- నివేదికలు రూపొందించిన కలెక్టర్లు
- నేటి సదస్సుకు ప్రాధాన్యాల కనుగుణంగా కసరత్తు
- సీఎం చంద్రబాబుతో తొలి సమావేశానికి కలెక్టర్లు, ఎస్పీలు
- జిల్లాలోని పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలు పవర్ పాయింట్ ప్రజంటేషన్

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న పరిస్థితులు.. అవసరాలు.. ప్రభుత్వ పరంగా తీసు కోవాల్సిన చర్యలు.. జిల్లా అవసరాలు.. అభివృద్ధి.. సమస్యలు తదితరాలపై కలెక్టర్లు సమగ్రంగా నివేదికలతో సోమవారం జరిగే కలెక్టర్ల సదస్సుకు సిద్ధమయ్యారు. ఇక శాంతిభద్రత లు.. గంజాయి.. తదితరాలపై కసరత్తు చేసిన ఎస్పీలు ముఖ్యమంత్రి సమావేశానికి హాజరు కానున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రప్రథమంగా కలెక్టర్ల సదస్సు సోమవారం రాష్ట్ర సచివాయలంలో జరగనుంది. దీనికి సంబందించి ఇప్పటికే కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. దీంతో సమావేశంలో చర్చించబోయే వివిధ శాఖలకు సంబందించిన కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమాచారాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారుల నుంచి తెప్పించుకున్నారు. ఏయే రంగాలు ఐదేళ్లలో పూర్తిగా పడకే శాయి.. వేటిపై తక్షణమే దృష్టిసారించాలి.. నిధుల లభ్యత.. ఆయా విభాగాల ప్రస్తుత పరిస్థితులపై కసరత్తు చేసి కలెక్టర్లు నివేదికలను తయారు చేశారు. కలెక్టర్ల సదస్సుకు సన్నాహకంగా జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు కూడా ఇప్పటికే నిర్వ హించారు. ఆయా శాఖల అధికారుల నుంచి పూర్తి సమాచా రాన్ని తీసుకుని సమగ్రమైన నివేదికను రూపొందించు కున్నారు. ఈ సదస్సుకు సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ, రెవెన్యూ, ఆర్థిక శాఖ మంత్రులు అనగాని సత్యప్ర సాద్, పయ్యా వుల కేశవ్ హాజరుకానున్నారు. సమావేశంలోనే కలెక్టర్లకు లక్ష్యాలను కూడా నిర్దే శించ నున్నట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ల సదస్సులు మొక్కుబడిగా జరిగేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్ల సదస్సులకు శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తొలి కలెక్టర్ల సదస్సుకు జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లతో హాజరు కానున్నారు. సీఎంతో సమావేశం ఖరారు కాగానే ఆయా శాఖల పరిస్థితిపై అధికారులతో బాపట్ల కలెక్టర్ వెంకటమురళి మూడు రోజులపాటు వరుసగా సమావేశమయ్యారు. గృహనిర్మాణశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖల పై సమగ్ర వివరాలు తెప్పించుకున్నారు. ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలతో పాటు ఆయా శాఖల ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితితో పాటు గంజాయి నియంత్ర ణకు గతంలో తీసుకున్న చర్యలతో పాటు భవిష్యత్తులో చేపట్ట బోయే యాక్షన్ ప్లాన్‌పై ఎస్పీ పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యారు. జిల్లాలో ఉన్న సహజ వనరులు, ఉద్యోగ, ఉపాధి రంగాలకు ఉన్న అవకాశాలు, పరిశ్రమలు, నిర్మాణ రంగంలోకి పెట్టుబడులు తదితర అంశాలపై కలెక్టర్ నాగలక్ష్మి ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్న తీరు, కొత్తగా తవ్వకాలకు గుర్తించిన ప్రదేశాలను కూడా వివరించనున్నారు. వివిధ శాఖల అధికారులతో రెండు రోజుల నుంచి సమావేశాలు నిర్వహిస్తూ సమగ్ర సమాచారాన్ని తెప్పించుకున్నారు. వాటిని పీపీటీ రూపంలో సదస్సులో నివేదించనున్నారు. బాపట్ల, రేపల్లెలో తాగునీటి సమస్య తీర్చడం అనేది ప్రాథమ్యాల జాబితాలో కలెక్టర్ చేర్చి నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి అద నపు స్టోరేజీ ట్యాంకుల అవసరంపై నివేదికలు తయారు చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా జిల్లాలో ఖజానాపై ఎంత భారం పడనుందనేది కూడా వివరించనున్నారు. బాపట్ల లో నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పట్టా లెక్కించడంపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. చీరాలలో హ్యాండ్ లూమ్ పార్కు, ఆక్వాపార్కు నిర్మాణం తదిత రాలపై నేటి సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

సదస్సు ఇలా..

జిల్లాలను ప్రగతిపథంలో నిలబెట్టే కీలక భూమికని పోషించే కలెక్టర్లకు ప్రభుత్వ ప్రాధాన్యాంశాలను తెలియజేసి వాటి అమలుకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు సీసీఎల్‌ఏ జయలక్ష్మి ప్రారంభోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత చీఫ్ సెక్రెటరి, రెవెన్యూ,ఆర్థిక, ఉపముఖ్య మంత్రులు ప్రసంగిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు సీఎం చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత 11 నుంచి 12 గంటల మధ్యన ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, పశుసంవర్థకం, మత్స్య, అటవీ, ఉద్యాన శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. 12.10 నుంచి 1 గంట వరకు సంక్షేమ శాఖల కార్యకలాపాలపై సమీక్షిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం ఆరోగ్య, సీజనల్ పరిస్థితులపై చర్చిస్తారు. ఆ తర్వాత ప్రాథమిక, సెకండరీ, హయ్యర్ ఎడ్యుకేషన్‌పై సమీక్ష ఉంటుంది. అనంతరం మున్సిపల్ పరిపాలన, సీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్), హౌసింగ్, జలవనరులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు. విద్యుత్‌చ్ఛక్తి, రెవెన్యూ(భూములు, రిజిస్ట్రేషన్, స్టాంపులు, ఎక్సైజ్) శాఖలపై సమీక్షిస్తారు. సమావేశం ఆఖరులో గంటన్నర పాటు శాంతిభద్రతల అంశంపై ఎస్పీలతో సమీక్షిస్తారు. ఈ సమావేశానికి డీజీపీ కూడా హాజరుకానున్నారు. సాయంత్రం 6.30 గంటలకు స్పెషల్ చీఫ్ సెక్రెటరి ముగింపు ప్రసంగంతో కలెక్టర్ల సదస్సు ముగుస్తుంది.



రుణాలు అనుమానాలు

- లోపభూయిష్టంగా జీడీసీసీ విధానం
- మిస్టరీగా మారిన రూ.53 కోట్ల రుణం మంజూరు



అక్రమంగా తీసుకున్న రుణాలతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రుణాల విషయంలో జీడీసీసీ బ్యాంకు అవలంబిస్తున్న విధానంపై అనుమానాలు నెల కొంటున్నాయి. ప్రధానంగా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మిర్చికి రుణం ఇచ్చే విషయంలో జాతీయ, ప్రైవేటు బ్యాంకులు పకడ్బందీగా వ్యవహరిస్తుండగా జీడీసీసీ తీరు లోపభూయిష్టంగా ఉన్నాయన్న విమర్శలున్నాయి. పర్సనల్ సెక్యూరిటీలు, ఆధార్‌ని సిబిల్ అకౌంట్‌కి లింకులను పట్టించుకోకుండా కేవలం కోల్డ్‌స్టోరేజ్ యజమాని ఇచ్చే బాండ్, పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా ఇబ్బడిముబ్బడిగా రుణాలు ఇస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు ఎవరెవరి పేర్లతోనో జీడీసీసీ బ్యాంకులో రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటు న్నాయి. తాజాగా జీడీసీసీ బ్యాంకులో వెలుగు చూసిన విశ్వసాయి కోల్డ్‌స్టోరేజ్ ఉదంతం కూడా ఇంచు మించు ఇలాంటిదే. గత ఏడాది, ఈ సంవత్సరం మిర్చి సీజన్ మందకొడిగా సాగింది. రైతులు ఆశిం చిన ధర మార్కెట్‌లో లభించలేదు. దాంతో రైతులు, కొంతమంది వ్యాపారులు దాదాపుగా 70 లక్షల మిర్చి టిక్కీలను కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేశారు. మిర్చి మార్కెట్ ఊపందుకోకపోతుండటంతో కొంతమంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. జాతీయ, ప్రైవేటు బ్యాంకులు అయితే రుణం ఇచ్చేముందు విచారణ అధికారులతో అన్ని వివరాలు సేకరిస్తాయి. కోల్డ్‌స్టోరేజ్ వద్దకు రైతు తప్పని సరిగా రావాలి. అలానే నిల్వ చేసిన స్టాకు, వెరైటీ, నాణ్యతని పరిశీలిస్తారు. పట్టాదారు పాసుపుస్తకం, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం జారీ చేసిన బాండ్ పేపర్‌ని తీసుకుని రైతుతో వేలిముద్ర వేయిస్తారు. అలానే పర్సనల్ సెక్యూ రిటీ కింద స్థిరాస్తిని కూడా తనఖా పెట్టుకుంటారు. సిబిల్ అకౌంట్‌తో ఆధార్‌ని లింక్ చేయడం వల్ల సంబంధిత రైతు/వ్యాపారి మరో బ్యాంకు నుంచి రుణం తీసుకునే అవకాశం ఉండదు. ఈ విధంగా ఎంతో పకడ్బందీగా వ్యవహరిస్తారు. అయితే జీడీసీసీ బ్యాంకు విషయానికి వచ్చేసరికి ఛైర్మన్ ఏది చెబితే అది ఆ బ్యాంకు శాఖల అధికారులు పాటిస్తారు.

నకిలీలతో రుణాలు.. మరుగున పరిచే యత్నాలు

జీడీసీసీ బ్యాంకు నల్లపాడు బ్రాంచ్‌లో వెలుగు చూసిన కుంభకోణం మరుగునపరిచే ప్రయత్నాలు పెద్దఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు న్నాయి. ఒక కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన సరుకుకు రూ.53 కోట్ల రుణం ఎలా ఇచ్చారనేది మిస్టరీగా మారింది. దాదాపుగా 150 మంది రైతుల పేర్లతో ఈ రుణాలు తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతోన్నాయి. ఈ క్రమంలో కొందరి ఆధార్‌లు, పట్టాదారు పాసుపుస్తకాలు నకిలీవి సృష్టించి బ్యాంకు నుంచి రుణం పొందారు. అసలు పొలం లేని వ్యక్తుల పేర్లతో రుణం మంజూరైందంటే నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు కూడా సృష్టించి ఉంటారని తెలుస్తోంది. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు కూడా రుణాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించారు. కాగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణంతో తాడికొండ, అమరావతి రాజధాని పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టినట్లు భోక్తలపై ఆరోపణలు వస్తున్నాయి. వట్టిచెరుకూరుకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఆందోళనతో ఆయన పేరు మీద తీసుకున్న రుణం రూ.10 లక్షలు తిరిగి చెల్లించేశారు. అంతమాత్రాన జరిగిన నేరాన్ని కప్పి పెడతారా అని టీడీపీ శ్రేణులు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై విజిలెన్స్, సహకార శాఖ అధికారులు విచారణలు జరిపితే అసలు సూత్రధారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాయి.

ఈనాం ఇక్కట్లకు పరిష్కారం

- 8 దశాబ్దాల రైతుల కల సాకారం
- పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి
- రైతులకు అండగా ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 4: ఎనిమిది దశాబ్దాల ఈనాం, ఎస్టేట్ భూముల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. భూములు సాగు చేసుకుంటున్నా- హక్కు పత్రాలు లేక అల్లాడుతున్న రైతులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో 5,010 ఎకరాల ఈనాం ఎస్టేట్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో పర్చూరు మండలం ఏదుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం, మార్టూరు మండలం లక్కవరం, జంగమహేశ్వరపురం గ్రామాలకు చెందిన 2,057 మంది రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చెన్నుంబొట్ల అగ్రహారంలో 802.71 ఎకరాలు 320 మంది రైతులు, ఏదుబాడులో 1,104.32 ఎకరాలు 430 మంది రైతులు, లక్కవరం 565 ఎకరాలు 386 మంది రైతులు, జంగమహేశ్వరపురం 2,539 ఎకరాలు 912 మంది రైతులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. 80 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర యాజమాన్య హక్కు పత్రాలు లేక పోవడంతో సన్నచిన్నకారు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవటంతోపాటు, విపత్తుల్లో పంటలు నష్టపోయినా ఎటువంటి పరిహారం అందని పరిస్థితి. వ్యవసాయ రుణాలు కూడా పొందలేకపోయేవారు. దీంతో ఆయా భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల వ్యవధిలోనే రైతుల సమస్యను ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా ముఖ్యమంతి చంద్రబాబుతోపాటు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుపోయారు. 80 ఏళ్ల సమస్యను పరిష్కరించాలని, రైతులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని ఆయన కోరారు. సమస్య పరిష్కారానికి తక్షణం చొరవ చూపాలని కలెక్టర్ వెంకటమురళి, జేసీ బి.సుబ్బారావులను ముఖ్యమంత్రి, మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం జేసీ ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్‌లతో భూములకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. రైతులకు పట్టాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని జేసీ రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితంగా తమ దశాబ్దాల కల నెరవేరనున్నదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ(ఫైల్)

నెల వ్యవధిలో రైతులకు పట్టాలిస్తాం : జేసీ

ఎన్నో దశాబ్దాలుగా నెలకొన్న ఈనాం, ఎస్టేట్ భూముల సమస్యను పరిష్కరించి నెల వ్యవధిలోనే రైతులకు పట్టాలు ఇస్తామని జేసీ బి. సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రా మాలను పర్యటించి సమస్యను తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత రైతులతో ఇప్పటికే సమావేశం నిర్వహించామన్నారు. రైతులకు మేలు చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.


నిండుకుండలా నాగార్జున సాగర్ జలాశయం

సాగర్ నీటి విడుదల నేడే



576 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

- 576 అడుగులు దాటిన జలాశయ నీటి మట్టం
- ఉదయం 8 గంటలకు గేట్లు తెరిచేందుకు ఏర్పాట్లు
- నదీ తీరంలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి), మాచర్ల రూరల్, రెంటచింతల, ఆగస్టు 4: ఉరకలెత్తుతూ ప్రవహిస్తోన్న కృష్ణమ్మ.. నాగార్జున సాగర్ జలాశయానికి చేరుతోంది. సాగర్ జలాశయం నిండు కుండలా మారింది. వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో సోమ వారం ఉదయం 8 గంటలకు సాగర్ క్రస్ట్ గేట్లు తెరవనున్నారు. ఇందుకోసం జలవనరు ల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నల్గొండ జిల్లాకు చెందిన అధికారులు క్రస్టుగేట్లను తెరవనున్నారు. సాగర్ నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరిగితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, రెవెన్యూ పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి 4,87,451 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి మట్టం గరిష్ఠ స్థాయి కొనసాగుతుండడంతో అదనంగా వస్తున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయానికి 4,27,711 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగుల కాగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు 576.10 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 271.90 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్ కుడికాల్వకు 5700 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 4613, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 26,040 క్యూసెక్కుల నీటిని సాగర్ నుంచి విడుదల చేస్తు న్నారు. డ్యాంనుంచి దిగువకు 37873 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా 3,22,817 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఇదే స్థాయిలో ప్రవాహం రానున్న వారం రోజులు కొనసాగే అవ కాశాలు ఉన్నట్లు జలవనరులశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పులిచింతలకు 25,339 క్యూసెక్కులు విడుదల

సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు ఆదివారం 25,339 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ చెప్పారు. 4 క్రస్ట్ గేట్లను 1 మీటర్ మేర ఎత్తి 17,048 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8291 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0469 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.05 మీటర్లు అంటే 6.7640 టీఎంసీల నీరుందన్నారు. సోమవారం సాగర్ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదల కానున్నట్లు ఎస్ఈ తెలిపారు.


టేల్‌రేస్ ఛానల్ ద్వారా విడుదలవుతున్న నీరు



తెనాలి: నిర్మాణపనులపై అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

అడవిలో ఉన్నట్లుగా ఉంది

- రాత్రిళ్లు లైట్లు కూడా వెలగవు..
- నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- గంజాయి మత్తుతో యువత హల్‌చల్
- పోలీసులు ఈ వైపు చూసింది లేదు..
- మంత్రి మనోహర్ వద్ద జగనన్న కాలనీ లబ్ధిదారుల ఆవేదన

తెనాలి రూరల్, ఆగస్టు 4: మంచినీటి పైపులైన్లు లేవు.. మురుగుపారుదలకు డ్రైన్లులేవు.. నడిచేందుకు రోడ్లులేవు.. వీధిదీపాలు వెలగవు అసలు కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఎదైనా అత్యసర వైద్యసాయం అవసరమైతే ఆస్పత్రికి వెళ్లేందుకు సౌకర్యం కూడా లేదు. వర్షం కురిస్తే జలమయంగా మారి పాములు సంచరిస్తూ ఉంటాయి.. మేం అసలు కాలనీలో ఉంటున్నామో అడవిలో ఉంటున్నామో తెలియని పరిస్థితుల్లో బతుకుతున్నామని మంత్రి నాదెండ్లమనోహర్ ఎదుట జగనన్న కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని పెదరావూరులో జగన్నకాలనీని మంత్రి మనోహర్ క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడ నిర్మాణ గృహాలను, స్థలాలను, పరిశీలించి లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మనోహర్‌కు పలు సమస్యలను వివరించారు. కాలనీలో కేవలం స్థలాలు ఇచ్చారే తప్ప అక్కడ నివాసయోగ్యానికి అవసరమైన సౌకర్యాలు కల్పించలేదన్నారు.

ఇళ్లు కట్టుకోలేని వారికి కాంట్రాక్టర్ల ద్వారా వాటిని కట్టిస్తామని చెప్పి నాణ్యతాప్రమాణాలు లేని ఇల్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. నగదు కూడా తమ ఖాతాలనుండి నేరుగా వారే డ్రా చేసుకుంటున్నారని ఫలితంగా ఇవేం కట్టుబడి అని ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో కనీసం ఇంటికి మంచి నీటి కనెక్షన్లు కూడా లేకపోగా రోడ్లు కూడా లేవని అన్నారు. స్థలాలు ఇచ్చారే తప్ప ఇక్కడ ప్రజలు ఎలా నివసిస్తున్నారో పట్టించుకునే అధికారులు కూడా లేరంటు విమర్శించారు. ఇక్కడ నివసించాలంటే భయంగా ఉంటుందని రాత్రులు ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే తెనాలి చేరేందుకు కనీస సౌకర్యంకూడా లేదని వివరించారు.

- జగనన్న కాలనీలో పేదల భూముల పేరుతో వారికి కేటాయించిన స్థలాలు, ఇంటి నిర్మాణాల పేరుతో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారించి నివేదికను తనకు అందించాలని మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు.
- గంజాయి, మద్యం తాగేందుకు జగనన్నకాలనీలు అడ్డాగా మారాయని స్థానికుల మంత్రికి తెలిపారు. పోలీసులు మాత్రం కాలనీవైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఈ ప్రాం తంలో వారి ఆగడాలతో భయాందోళనగా ఉందని వివరించా రు. దీంతో మనోహర్ పోలీసులను పిలిచి గత ప్రభుత్వం మాదిరి పనిచేస్తే సహించేది లేదన్నారు. పేదలుండే ప్రాంతంలో ఎందుకు పోలీసులను పర్యవేక్షించేలా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలనీలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం : మంత్రి

కాలనీలో దుస్థితిని గమనించాను.. లబ్ధిదారుల సమస్యలను విన్నాను. రాబోయే రోజుల్లో ఆ సమస్యలన్నింటిని పరిష్కరించి మంచి కాలనీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కాలనీలో ప్రతి లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లానని రానున్న రోజుల్లో తప్పనిసరిగా ప్రతి లబ్ధిదారుడికి మంచి జరిగేలా బాధ్యత తీసుకుంటానని మనోహర్ హామీ ఇచ్చారు.

కొల్లిపర మండలంలో..

కొల్లిపర, ఆగస్టు 4: ఆదివారం మండల పరిధిలోని దావులూరులో ఇళ్ల స్థలాలను, గృహనిర్మాణాలను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. రోడ్లు, గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, వాటర్, విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా లేక పోవటంతో గృహనిర్మాణాలు చేయలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, మౌలిక వ స త ు లు కల్పించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంత రం జరిగిన అవగాహన సదస్సులో మనోహర్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం పేదప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తోందన్నారు. దావులూరులో లేఔట్‌లో రూ.10 లక్షలతో రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ సిద్ధార్థ, హౌసింగ్ ఈఈ భాస్కరరావు, డీఈ రఫీ ఉల్లాఖాన్, ఏఈ సుబ్బారావు, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపర మండలం దావులూరు కాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్



తాడికొండ బీఎస్ఎన్ఎల్ 4జీ సిగ్నల్స్ టవర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మార్చి నాటికి దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- తాడికొండలో 4జీ టవర్స్ పరిశీలించిన పెమ్మసాని

తాడికొండ, అగస్టు 4: దేశవ్యాప్తంగా వీలైనంత వేగంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను మార్చినాటికి అమలుచేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తాడికొండలో బీఎస్ఎన్ఎల్ 4జీ సిగ్నల్ వ్యవస్థను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించి టెస్ట్ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన బేస్ బ్యాండ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఎక్కువ ధరలతో ఫోన్ రీఛార్జ్‌లు చెల్లించి ఫోన్ సర్వీసులు ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. రీఛార్జ్ ధరలు పెరగటం వల్ల ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో బీఎస్ఎన్ఎల్‌ను 4జీ సేవలతో ఆధునీకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలలుగన్న విధంగా ప్రజలకు ఉన్నతమైన ఫోన్ సేవలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఏపీలో క్వాలిటీతో కూడిన 4జీ సేవలను అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అతితక్కువ ధరలకే ఇంటర్నెట్ సేవలను ప్రజలు అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే కేంద్రం 4జీ టవర్లను సిద్ధం చేస్తుందన్నారు. బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జేరవి మాట్లాడుతూ ఏపీలో 300 లోకేషన్లను రెడీ చేసుకొని టెస్టులు చేస్తున్నామని తెలిపారు. 400 సెంటర్లలో టవర్స్‌కు ఎక్విప్మెంట్‌ను ఇన్‌స్టాల్ చేసి 4జీ సేవలు అందించటానికి సిద్ధం అవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఐటీ శిక్షణ

గుంటూరు(విద్య), ఆగస్టు 4: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులతో పూర్తిచేసిన వారికి ఐటీ శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన ఇందుకోసం ప్రభుత్వ ఐటీఐ కళాశాల(కలెక్టరేట్ ఎదుట) క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 2023-24 విద్యా సంవత్సరాల్లో 75శాతం మార్కులతో ఇంటర్ (బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ) పూర్తిచేసి ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్‌జిరాక్స్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ, రాత పరీక్ష ద్వారా ఐటీ శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ఇతర వివరాల కోసం మణిదీప్, సెల్ నం.80746 07278లో సంప్రదించాలని సూచించారు.

ఐటీఐ కళాశాలల్లో మూడో విడత సీట్ల భర్తీకి
దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), ఆగస్టు 4: జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో మూడో విడత సీట్ల భర్తీకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, సహాయ సంచాలకులు సాయివరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26లోగా నెట్ సెంటర్స్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పది మార్కుల జాబితా, కుల ధ్రువీకరణపత్రం, టీసీ, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, విద్యార్థి ఫొటోలు, మెయిల్ ఐడీ, ఫోన్‌నంబర్, రెసిడెన్సియల్ అడ్రసు తదితర వివరాలు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

TENALI MUNICIPALITY

E-procurement Short & General Tender Notice

E-procurement Short & General Tender Notice No. 06 & 04/ 2024-25/ General Fund Online tenders are hereby invited from the contractors/ contracting agencies for no.of tender Works : 28 for Est Amount Rs.245.25Lakhs. The tender document is available for download from Dt: 05-08-2024 (04.00pm) onwards and last date for bid submission for tender is on Dt:12-08-2024 (2.30pm) & 20-08-2024 (2.30pm) through Further details can be seen at 'e' procurement market Place i.e., "www.apeprocurement.gov.in".

Sd/- COMMISSIONER, TENALI MUNICIPALITY

రెండు రోజుల్లో రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ ప్రారంభం

- 26వేల ఎకరాలలో ముళ్ల కంప తొలగింపు



వైసీపీ సర్కార్ ఐదేళ్ల పాలనలో అడవిలా మారిన హైకోర్టు పరిసర ప్రాంతాలు

తుళ్లూరు, ఆగస్టు 4: రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు రెండు రోజుల్లో మొదలు కానున్నాయి. చంద్రబాబు సీఎం కాగానే అమరావతి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పర్మినెంట్ ప్రభుత్వ అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ భవన నిర్మాణాల కొనసాగింపు చేయాలనే దానిమీద మద్రాసు ఐఐటీ బృందం పునాదులను పరిశీలించింది. అదేవిధంగా వందల సంఖ్యలో కట్టిన ఉద్యోగుల ఇళ్ల సముదాయాల టవర్లను హైదరాబాద్ ఐఐటీ బృందం పరిశీలించింది. ముందు జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తే ఎక్కడ నుండి అభివృద్ధి పనులు కొనసాగించాలనేది అర్థం అవుతుందని సీఆర్డీఏ అధికారులు చెపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధానిలో పర్యటించి ముందు జంగిల్ క్లియరెన్స్ పనులు చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. గత నెల 11వ తేదీన జంగిల్ క్లియరెన్స్ పనులకు సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. అదే నెల 29న రివర్స్ టెండరింగ్ కూడా పూర్తై ప్రముఖ ఎన్‌సీసీ కంపెనీ జంగిల్ క్లియరెన్స్ పనులు దక్కించుకుంది. సోమ, బుధవారాలలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది. మొత్తం 26వేల ఎకరాలలో జంగిల్ క్లియరెన్స్ పూర్తిచేయాలని గడువు విధించారు. రాజధాని అమరావతిని ఐదేళ్లలో వైసీపీ సర్కార్ అడవిని చేసింది.

బొల్లా.. అసత్య ప్రచారాలు మానుకో...

- ఎమ్మెల్యే జీవీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, ఆగస్టు 04: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హయాంలో ఘర్షణలు అదుపు చేసి ఉంటే రషీద్ మృతి చెందేవాడు కాదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకోవాలని, ఘర్షణలో బొల్లా హస్తం ఉన్నట్లు తేలితే కటకటాల్లో వేయిస్తామని హెచ్చరించారు. శవాలను చూడందే జగన్‌కు, అసత్య ప్రచారాలు చెయ్యనిదే బొల్లాకు నిద్ర పట్టడంలేదని జీవీ విమర్శించారు. గతంలో ఏనుగుపాలెంలో శ్రీదేవి అనే మహిళ మృతి చెందిన రోజు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి, ఇక్కడ ఎమ్మెల్యేగా బొల్లా ఉన్నారని, ఆనాడు ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఎందుకు అరెస్టు చెయ్యలేదని నిలదీశారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టబోమన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా బొల్లాకు బుద్ధి రాలేదన్నారు. దుర్మార్గాలను ప్రోత్సహించడం, అమాయకులపై తప్పుడు కేసులు పెట్టడం కాదని, దోషులను శిక్షించాలన్నారు. గతంలో మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై బొల్లా అసెంబ్లీలో ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. మీరు చేసిన హత్యా రాజకీయాలకు వివేకానందరెడ్డి కుమార్తె మీపై నమ్మకంలేక పక్క రాష్ట్రానికి వెళ్లి సీబీఐ విచారణ కోరిందని తెలిపారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. కాలవలకు నీళ్లు వచ్చాయని, గుండ్లకమ్మకు సాగర్ జలాలు ప్రవహిస్తున్నాయని, రాష్ట్రంలో జలకళ మొదలైందన్నారు. నీ విషపు చుక్కలు వెయ్యరాదని బొల్లాకు సూచించారు. మీ ప్రభుత్వ హయాంలో అన్నీ దొంగ సర్టిఫికెట్స్‌తో పింఛన్లు పంపిణీ చేశావని, ఇప్పటికే నియోజకవర్గంలో వందలకొద్దీ దొంగ పింఛన్లను ఆధారాలతో గుర్తించామని తెలిపారు. అవి ఎలా వచ్చాయో తెలపాలని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ నీకు రాజకీయాల్లో పరిపక్వత రావాలని బొల్లాకు సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే విమర్శలు చేయడం ఏమిటని, ఇది సభ్యత కాదని, సంస్కారం కాదని కొంత ఓపిక పట్టాలంటూ బొల్లాకు చురకలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రొడ్డా వీరాంజనేయరెడ్డి, మురళీ కృష్ణయాదవ్, అయుబ్ ఖాన్, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష దాటిన జనసేన సభ్యత్వాలు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెల్లడి

గుంటూరు, ఆగస్టు 4: ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వాలు లక్ష దాటినట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం పార్టీ 28వ డివిజన్ అధ్యక్షుడు మామిడి రామారావు ఆధ్వర్యంలో ఉదయం నల్లగుంట నీలంపాటి అమ్మవారి గుడి దగ్గర, మధ్యాహ్నం సీతమ్మకాలనీ ఐదో లైన్‌లో ఏర్పాటుచేసిన పార్టీ సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఇప్పటికే జనసేన సభ్యత్వాలు పది లక్షలు దాటినట్లు తెలిపారు. జనసేన సభ్యత్వ నమోదుతో పాటు రూ.5లక్షల జీవితబీమా కవరేజ్ కూడా అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఈ రెండు శిబిరాల్లో కొత్తగా 500 మందికి పార్టీ సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమాల్లో 30వ డివిజన్ జనసేన అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు, శ్రీపతి భూషయ్య, రాంబాబు నాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు లక్ష దాటిన సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నాయకులు వేడుకలు జరిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఐటీ విభాగం ఇన్‌ఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పార్టీ కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు.



సభ్యత్వ నమోదు శిబిరంలో గాదె వెంకటేశ్వరరావు



ఉద్యోగావకాశాలు

- గుంటూరు గోరంట్లలోని భాష్యం క్యాంపస్‌లనందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. డ్యూటీ : 12 గం॥లు, జీతం : 10,000/- + భోజనం. ఫోన్ : 8985250265 RK-1269
- WANTED OFFICE ASST., Qua : Any Degree with Computer Knowledge. English Speaking must. MAXMULLER PUBLICATION, Guntur. Cont : 9494161313. AJG-191782
- ఆంధ్రప్రైమ్ హాస్పిటల్ నందు పని చేయుటకు PRO's (మార్కెటింగ్) మరియు అకౌంటెంట్ Experience / Freshers కావలెను. సంప్ర॥ 7799892224. AAA-9304
- ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్టూరు (మం) బొబ్బేపల్లి (గ్రా)లో ఇంటి వద్ద సహాయకురాలుగా ఉండుటకు చదువుకున్న హిందూ యువతి కావలెను. అర్హతను బట్టి జీతం 10,000 నుండి 12,000 వరకు ఉండును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 72931 99999. AJG-191780
- అతిథి గృహ ఫుడ్స్ నందు పనిచేయుటకు మహిళలు కావలెను. సేల్స్ గర్ల్స్ మరియు పిండివంటలు తయారు చేయుటకు హెల్పర్స్ కావలెను. వయస్సు 18 నుండి 35 సం॥లోపు మాత్రమే. టైమ్ : ఉ 8 గ.ల నుండి సా. 8 గ.ల వరకు మరియు ఉ 9 గ.ల నుండి సా. 9 గ.ల వరకు, ఆకర్షణీయమైన జీతం, (పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ కలదు). లక్ష్మీపురం హరిహర మాల్ ప్రక్కన, గుంటూరు. ఫోన్ నెం: 9396971898. MA-535
- ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663 AJH-4211

రియల్ ఎస్టేట్

- నవ్యాంధ్ర రాజధాని అమరావతి నేషనల్ హైవే IJM, కొప్పురావూరు సమీపంలో (UDA) ఇళ్ళ స్థలాలు, పొలాలు క్లియర్ టైటిల్‌తో కలవు. సంప్ర॥ 9346724984, 9885163444. AJG-191787
- గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ &UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 9848986831. SJAA-148

అద్దెకు

- Sri Padmavathi Sreeinvasa Nilayam, Opp : Municipal Park, Brodipet, 6/12, Cross Gr. Floor 2 BHK house prefer : Brahmins with car park. Cell : 9972291711 AJG - 191497

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును


- బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999 AJB-194795

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- జాస్తి వీరాంజనేయులు

సింహాచలం, ఆగస్టు 4: గత ఐదేళ్లుగా తిరోగమన దిశలో పయనించిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాత్రమే ఉందని, అందుకు తగిన శక్తియుక్తులు ఆయనకు ప్రసాదించాలని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ప్రార్థించానని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అప్పన్నకు చంద్రబాబు పేరున పూజలు చేయించామన్నారు. గత వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని పూర్తిగా నాశనం చేశారని, కానీ చంద్రబాబు అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ఆయన కృషికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

కోటప్పకొండ వద్ద ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



షేక్ నాయబ్ ఖాజా మృతదేహం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4: మండలంలోని చినతురకపాలెం గ్రామానికి చెందిన షేక్ నాయబ్ ఖాజ(17) ఆదివారం మధ్యాహ్నం కోటప్పకొండ వద్ద గల చిలకలూరిపేట మేజరు పక్కన ఉన్న వ్యవసాయబావిలో ఈతకు వెళ్లి మృతిచెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య కథనం మేరకు.. చినతురకపాలెం గ్రామానికి చెందిన నాయబ్ ఖాజా, మరి కొంతమంది విద్యార్థులు ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో చిలకలూరిపేట మేజరు వద్ద గల వ్యవసాయబావిలో ఈతకు వెళ్లారు. నాయబ్ ఖాజాకు ఈత రాకపోవడంతో బావిలో మునిగిపోయి ఊపిరాడక మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మాబు సుబాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన నాయబ్ ఖాజా యలమందల జడ్పీ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు.

స్నేహితుల దినోత్సవం రోజు విప్పర్లలో విషాదం

- హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విప్పర్ల వాసుల మృతి



రోహిత్ బాల ప్రసన్న(ఫైల్)

రొంపిచర్ల, ఆగస్టు 4: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన కందుల రోహిత్(25), ఉడతల బాలప్రసన్న(22) హైదరాబాద్‌లో జరిగిన ద్విచక్రవాహన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రోహిత్ మూడు సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన విప్పర్ల గ్రామానికి చెందిన ఉడతల బాలప్రసన్న(22) విప్పర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇరువురు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. సమాచారాన్ని విప్పర్ల గ్రామంలోని బంధువులకు స్థానికులు తెలియజేశారు. ఇరువురు బంధువులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలివెళ్లారు. గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. రోహిత్ తండ్రి మృతిచెందగా తల్లి, సోదరుడు గ్రామంలో ఉంటున్నారు. బాలప్రసన్న తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ముగ్గురు సంతానం కాగా బాలప్రసన్న చివరివాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామమైన విప్పర్లకు ఆదివారం తీసుకువచ్చారు. బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

సివిల్స్‌పై దృష్టి సారించాలి

- ప్రవాసాంధ్రుడు, కేవైఎస్ఎస్ అధ్యక్షుడు పాపినేని గాంధీ
- విద్యార్థినులకు రూ.25లక్షల ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థినులతో దాతలు, పాలకవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు తగ్గుతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సివిల్స్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం కావాలని విద్యార్థినులకు ప్రవాసాంధ్రుడు, కమ్మ యువ సేవ సమితి(కేవైఎస్ఎస్) అధ్యక్షుడు పాపినేని గాంధీ సూచించారు. ఆదివారం స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో పాపినేని గాంధీ ఆధ్వర్యంలో 200మంది పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.12వేలు చొప్పున రూ.25లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సభకు కమ్మజన సేవాసమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాపినేని గాంధీ మాట్లాడుతూ సమయం, ఆరోగ్యం తప్ప ఇతర విషయాల గురించి ఆలోచించవద్దని సూచించారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాగే ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందజేస్తామని, నూతన భవన నిర్మాణానికి నిధులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. దాతలు మన్నె భద్రయ్య, వేల్పూరు మాజీ సర్పంచ్ శివమల్లేశ్వరరావు, గ్రంధసిరి పంచాయతీ అధ్యక్షుడు రావేళ్ల శ్రీధర్ మాట్లాడుతూ పాపినేని గాంధీని ఆదర్శంగా తీసుకుని తరువాత తరాలకు సాయం చేయాలని కోరారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికాలో కష్టపడి సంపాదించిన నిధులను విద్యార్థుల విద్య కోసం అందజేయడం పట్ల పాపినేని గాంధీ, ఆయన మిత్రులను అభినందించారు. ఈ సందర్భంగా ఉపకార వేతనాల నిధికి కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు చెరో రూ.లక్ష అందజేశారు. అనంతరం దాతలను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్యచౌదరి, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, ఘంటా పున్నారావు, ముద్దన రాజేష్, పైనేని సీతారామయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

అవాస్తవ కథనాలు ప్రచురించడం సమంజసం కాదు

- రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ

భట్టిప్రోలు(కొల్లూరు), ఆగస్టు 4: అవాస్తవ కథనాలను ప్రచురించి ప్రజలకు తప్పుడు సమాచారం చేరేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శనివారం టీడీపీ, వైసీపీ పరస్పర నిందారోపణలు చేసుకుని రథం సెంటర్‌లో చర్చావేదిక ఏర్పాటు చేసుకోవడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని నిలువరించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కాగా టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రయత్నించగా బందోబస్తులో ఉన్న ఎస్ఐ సాయంత్రం 6 గంటల వరకు ఆ ప్రదేశానికి వెళ్లవద్దని సూచించారన్నారు. ఆ సమయంలో టీడీపీ నాయకుడి మొబైల్ కిందపడటంతో వారి కార్యకర్త ముందుకు వంగి సెల్‌ఫోన్ తీసి ఇచ్చాడని, వారిద్దరి మధ్య ఎస్ఐ ఉన్నాడన్నారు. ఆ సమయంలో తీసిన ఫొటోను వక్రీకరించి చూపుతూ ప్రముఖ పత్రిక ఎస్ఐ చొక్కా పట్టుకున్న టీడీపీ కార్యకర్త అనే అవాస్తవ కథనాన్ని ప్రచురించిందన్నారు. కొన్ని పత్రికలు దానిపై పోలీసుశాఖ నుండి వివరణ తీసుకుని వాస్తవ కథనాలు ప్రచురించాయన్నారు. వార్తను ప్రచురించే సమయంలో దానికి సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని ప్రచురించడం మంచిదన్నారు. సమావేశంలో చుండూరు సీఐ, భట్టిప్రోలు, నగరం ఎస్ఐలు పాల్గొన్నారు.

లారీ, మోటారు సైకిల్ ఢీ

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



జడా పెద్దబాజీ మృతదేహం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4: కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని వద్ద లారీ, మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన జడా బాజి, మందలపాటి బుజ్జి ఇద్దరు మోటారుసైకిల్‌పై నరసరావుపేటకు వస్తుండగా నరసరావుపేట మండలం కాకాని వద్ద గుంటూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్న లారీ, మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో జడా బాజీ(22) అక్కడికక్కడే మృతి చెందాడు. మందలపాటి బుజ్జి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బాజీ తల్లి జడా ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



లంక గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

లంక గ్రామాలకు వరద విపత్తు

- ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం కావాలి
- జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

కొల్లూరు, ఆగస్టు 4 : కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లు నిండుకుండలా మారాయని, దీంతో లంక గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని పెసర్లంక కమ్యూనిటీ భవనంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాశం బ్యారేజీకి సాగర్ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. బ్యారేజీకి వచ్చే వరద నీటిని సముద్రంలోకి వదిలే సమయంలో దిగువన ఉన్న లంక గ్రామాలకు వరద విపత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణానదికి 8 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు సముద్రంలోకి విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో వరద ప్రభావిత ప్రాంత గ్రామాల్లో ప్రజలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వరద విపత్తును ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని ఆర్డీవోకు అందించాలన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వరద బాధితులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. భోజన వసతి కల్పించేందుకు అవసరమైన సామగ్రి, గ్యాస్ సదుపాయాలతో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడినా, అసౌకర్యం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల తరలింపునకు పడవలు ఏర్పాటు చేసుకోవాలని, మంచినీటి ఎద్దడి లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు వరదలు కారణంగా ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు బంధువులు, సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు ముందస్తుగానే తరలివెళ్లాలన్నారు. సచివాలయ ఉద్యోగులంతా వరద విధుల్లో పాల్గొని లంక గ్రామాల్లోని కుటుంబాల సమాచారాన్ని అధికారులకు సమర్పించాలన్నారు. పెసర్లంక అర వింద వారధి ఎగువన పడిన గండిని పూడ్చే విషయంలో ఆర్‌సి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం కొల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో రేపల్లె ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మీకుమారి, ప్రభుత్వ శాఖల అధికారులు వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ముప్పుపై గ్రామాల్లో ఆటో ప్రచారం...

కృష్ణానదికి పొంచి ఉన్న వరద ముప్పు గురించి లంక గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కృష్ణానదికి భారీ వరద వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని, లంక గ్రామాల్లో నివాసం ఉంటున్న ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. వరద విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధం అయ్యిందని, అలాగని ఎవరు నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు.

పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : ఎంపీపీ

వేమూరు, ఆగస్టు 4 : గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రధాన భూమిక వహించాలని ఎంపీపీ ఎల్లమాటి మోహన్‌రావు కోరారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న తరుణంలో గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా లేకపోతే రోగాలు ప్రబలే అవకాశం ఉందని ముందస్తు జాగ్రత్త కోసంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయితీరాజ్ శాఖ ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ వెంకట సురేష్‌బాబు మాట్లాడుతూ విషజ్వరాలు డెంగీ, టైఫాయిడ్, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తమ సిబ్బంది ద్వారా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ఆయా వ్యాధులకు కావలసిన మందులను సిద్ధం చేశామన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల దుస్థితిపై ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశాల మేరకు నివేదిక సిద్ధం చేస్తున్నామన్నారు. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను పునఃనిర్మించేందుకు అంచనాలతో కూడా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. తహసీల్దార్ సుశీల మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈవోపీఆర్డీ శేఖర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిధుల వినియోగంపై చట్టపరమైన అంశాలను వివరించారు. గ్రామ సభల తీర్మానం లేకుండా పనులు చేపట్టడం కానీ, నిధులు వినియోగించడం కానీ చేయరాదన్నారు. ఈ సందర్భంగా వేమూరు-కొల్లూరు ప్రధాన రహదారి నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ నిమిత్తంగా నిధులు మంజూరు కోసం సభ్యులు ఆమోదం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రావు

జంధ్యాల పుష్పవిలాపం సుమధురం

- సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, ఆగస్టు 4 : జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన పుష్పవిలాపం కావ్యాన్ని ఘంటసాల మృదు మధురంగా ఆలపించి జంధ్యాల ఉనికిని తెలుగు ప్రజలకు తెలియజేశారని, ఉదయశ్రీ, కరుణశ్రీ కావ్యాలు రచించారని సాహితి భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ తెలిపారు. ఆదివారం జంధ్యాల పాపయ్య 112వ జయంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ జంధ్యాల గుంటూరు జిల్లా కొమ్మూరు గ్రామంలో జన్మించి గొప్ప అధ్యాపకుడిగా, రచయితగా పేరుగాంచారని, రచయితగా కావ్యాలు ఎన్నో రచించి తెలుగుజాతి ఘనతను తెరకెక్కించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కస్తూరి శ్రీనివాసరావు, కామరాజు కాళీదాసు, సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, గౌరవాధ్యక్షులు ఎం.జాకబ్ తదితరులు జంధ్యాల పాపయ్య శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.

24న సామూహిక షష్టిపూర్తి కార్యక్రమం

- ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల

కర్లపాలెం, ఆగస్టు 4 : కర్లపాలెం శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈనెల 24వ తేదిన 102 మంది దంపతులు సామూహిక షష్టి పూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య ప్రముఖులతో శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24న ఉదయం 5 గంటలు నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విక ఆరాధన, నవగ్రహసహిత నక్షత్ర మండపారాధన తదితర పూజలు అనంతరం సామూహిక షష్టిపూర్తి కార్యక్రమం జరుగునని తెలిపారు. ఏ ప్రాంతం వారైన షష్టిపూర్తి కార్యక్రమంలో పాల్గొనవచ్చునని తూనుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. పూర్తి వివరాలకు తూనుగుంట్ల శ్రీనివాసరావు 9866402608, మద్దాల సంజీవరావు 9849653189, అచ్యుత శ్రీనివాసరావు 9290091661 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నందిపాటి శివ నాగమల్లేశ్వరరావు, రాజశేఖర్, సత్యనారాయణ, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తూనుగుంట్ల శ్రీనివాసరావు

డ్రెయిన్లలో నామమాత్రంగా పూడికతీత

- పట్టించుకోని డ్రెయినేజీ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



అరవపల్లి డ్రెయిన్‌లో సగం పూడికతీసి వదిలేసిన చిత్రం

రేపల్లె, ఆగస్టు 4 : ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో డ్రెయిన్‌లో తూటికాడ తొలగించాలంటూ గత నాలుగు నెలలుగా డ్రెయినేజీ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేదంటూ తీరప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్‌లో తూటికాడ తొలగించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన గత నాలుగురోజుల కిందట అరవపల్లి డ్రెయిన్, ఉప్పూడి డ్రెయిన్‌లో నామమాత్రంగా తూటికాడ తొలగించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆదివారం రైతులు డ్రెయినేజీ అధికారులుకు ఎన్నిసార్లు ఫోన్ చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరువాత నామమాత్రంగా డ్రెయిన్‌లో తూటికాడను తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. డ్రెయిన్‌లో పూడికలు తీయాలని ప్రభుత్వం లక్షలాది రూపాయలు నిధులు మంజూరు చేసినా గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై డ్రెయిన్‌లో తూటికాడ తొలగించకుండా సొమ్ము చేసుకుంటున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఈ డ్రెయిన్ పరిధిలో వందలాది ఎకరాల పంట భూమి ఉందని, ఏటా పలుమార్లు అధికారులకు చెప్పినా వేసవిలో డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టకుండా ఇప్పుడు పూర్తిగా నీరు వచ్చిన తరువాత నామమాత్రంగా పనులు చేస్తున్నారని, దీని కారణంగా లక్షలాది రూపాయల పంట నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అరవపల్లి, ఉప్పూడి డ్రెయిన్‌లో సగం మాత్రమే తూటికాడను తొలగించి వదిలేశారని, తక్షణమే ఉన్నతాధికారులు దృష్టిసారించి పూర్తి స్థాయిలో తూటికాడను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సగం తూటికాడ తొలగించి వదిలేసిన ఉప్పూడి డ్రెయిన్



కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న రోటరీక్లబ్ ఆఫ్ బాపట్ల సభ్యులు.

రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే

బాపట్ల, ఆగస్టు 4 : రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల సభ్యుల సమక్షంలో ఫ్రెండ్స్‌షిప్ వేడుకలను కేక్ కట్ చేసి ఫ్రెండ్‌షిప్‌డే బ్యాండ్‌లను ఒకరికొకరు కొట్టుకొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా, ధనికులు, పేదవారు అనే తేడా లేకుండా రక్తసంబంధీకులు కంటే ఎక్కువగా ప్రేమించే వారే ఫ్రెండ్స్ అని, ఇటువంటి మంచి కార్యక్రమం రోటరీ నందు నిర్వహించుకోవటం ఓ మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రోటరీ సభ్యులు ఇ.హరిబాబు, బుర్లె రామసుబ్బారావు, జిట్టా శ్రీనివాసరావు, తోట కృష్ణ, బొమ్మిశెట్టి శివరామకృష్ణ, కొత్త ఆంజనేయ వరప్రసాద్, యర్రా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ రావూరి వీర రాఘవయ్య, జాగర్లమూడి లక్ష్మీ, తాళ్ళూరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

హైవెండ్ హైస్కూల్‌లో...

కర్లపాలెం, ఆగస్టు 4 : కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చిన్నారులు ఘనంగా నిర్వహించారు. స్నేహం ప్రాముఖ్యతను గురించి చిన్నారులకు ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాలలోని ఆయా తరగతుల చిన్నారులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్‌షిప్ బ్యాండ్‌లను ఒకరికొకరు చేతులకు కట్టుకున్నారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులు, సభికులను విశేషంగా అలరించాయి. కార్యక్రమాలను మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ పెదమల్లు చాంధిని, ఛైర్మన్ ఉదయచంద్రరావు పర్యవేక్షించారు. రహీమ్, రఫీ, అకడమిక్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, రామలక్ష్మి, నెహా, సుమలత, అనిత, ద్వారక, హిమబిందు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్నేహబంధాన్ని తెలుపుతున్న బాలికలు

నేడు శ్రీబగళాముఖి అమ్మవారికి సహస్రాధిక అష్టోత్తర కలాభిషేకాలు



శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 4 : ప్రముఖ శక్తి క్షేత్రాలలో ఒకటైన శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో సోమవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి సహస్రాధిక అష్టోత్తర కలాషేభికాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈసందర్భంగా అమ్మవారికి 1008 కలశాలతో పంచామృతాలు, సుగంధద్రవ్యాలు, వివిధ ఫలరసాలతో, వివిధ నదిజలాలతో, విశేష వేదమంత్రాలతో ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేక నిర్వాహణ కార్యక్రమాలు జరుగుతాయని జి.నరసింహమూర్తి తెలిపారు. అమరావతి మండలం యండ్రాయి గ్రామానికి చెందిన శ్రీ గీతా వెంకటేశ్వర వేద పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7.30 నిమిషాలకు మంగళవాయిద్యాలతో అభిషేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగిస్తాయన్నారు. అవకాశం ఉన్న భక్తులు పసుపు, కుంకుమ, గంధం, విబూది, పంచామృతములు, పన్నీరు, వట్టివేర్లు, నదిజలములు, అన్నిరకముల పుష్పాలు, నిమ్మకాయలు, పండ్లు తీసుకురావాలని కోరారు.

● శ్రావణ మాసంలో శ్రీబగళాముఖి అమ్మవారిని దీక్షాపూర్వకంగా కొలుచుటకు సర్వహిందు వైదిక సాంప్రదాయంలో అమ్మవారి ఆరాధన ఎంతో ప్రాచీనమైనదని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈనెల 5 నుంచి 30వ తేదీ వరకు శ్రీబగళాముఖి అమ్మవారి దీక్షా స్వీకరణ, ఇరుముడులు సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ దీక్షను స్త్రీ, పురుషులు స్వీకరించవచ్చునని, పురుషులు పసుపురంగు పంచ ధరించి, ఎరుపురంగు గల కండువా మెడలో ధరించాలన్నారు. స్త్రీలు ఎరుపు రంగు రవిక, పసుపు రంగుతో చీర ధరించి ఎర్రని కండువా మెడలో వేసుకోవాలని తెలిపారు. దీక్షధారణకు పసుపురంగు పూసలను మాలగా ధరించాలన్నారు. దీక్షధారణ అమ్మ ఆలయంలో మాత్రమే గురుస్వామిచే ధరించాలని తెలిపారు. 11 రోజులు లేదా 21 రోజులు ఈ మాలను ధరించాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

బాపట్ల, ఆగస్టు 4 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్లలోని రౌడీషీటర్లకు పట్టణ ఎస్సై అబ్దుల్ రజాక్ ఆదివారం పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకొని సామాన్య జీవితాన్ని గడపాలన్నారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. రౌడీషీటర్లు ప్రస్తుతం వారి జీవనవిధానం, వారు చేస్తున్న వృత్తి, ఇతర వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకొని ఆ వివరాలను రికార్డు చేసుకోవటం జరిగిందన్నారు. చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు పాల్పడితే వారిని ఉపేక్షించేదిలేదని, అటువంటివారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా నాగరాజు నిరాహార దీక్ష

వేమూరు, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజు ఆదివారం వేమూరులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ముందుగా చావలి రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెయిన్ రోడ్డులో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం రాజ్యాంగ సవరణ ద్వారానే జరగాలి తప్ప కోర్టులు, ప్రభుత్వాలు చేయగలిగిన అంశాలు కాదన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణపై పునఃసమీక్షించేంత వరకు మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తామని నాగరాజు తెలియజేశారు. మాల మహానాడు రాష్ట్ర నాయకుడు హర్షకుమార్ కోర్టులో పోరాటం చేస్తున్నట్లుగా గుర్తు చేశారు.

జనసేన సభ్యత్వాలను జయప్రదం చేయాలి : గోగన

బాపట్ల, ఆగస్టు 4 : జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు సభ్యత్వం చేయించుకోవాలని, పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు తోడుగా ఉండాలని జనసేన పార్టీ దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు అన్నారు. పట్టణంలోని 17వవార్డులో ఆదివారం జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన అభిమానులు సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి వినోద్, కళ్యాణ్, ఆంజనేష్‌నాయుడు, అఖిలేష్, శిరీష్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మాజీ సభ్యుడు



సీఎం చంద్రబాబుతో మోసిన్ నియాజి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 4 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును విజయవాడ ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ నాయకుడు ఎస్ఎస్ మోసిన్ నియాజి మర్యాదపూర్వకంగా కలిశారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీబగళాముఖి అమ్మవారి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మోసిన్ నియాజి వివరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి అందజేసిన అమ్మవారి తీర్థప్రసాదాలను, దుశ్శాలువాలను, చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకోవాలని ముఖ్యమంత్రిని మోసిన్ నియాజి కోరారు.

షుగర్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవాలి

- డాక్టర్ చల్లా రామ్మోహనరావు

కర్లపాలెం, ఆగస్టు 4 : షుగర్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలని డాక్టర్ చల్లా రామ్మోహనరావు అన్నారు. కర్లపాలెంలో శ్రీరామకృష్ణ సేవాసమితిలో పేరలి నరసయ్య చారిటబుల్‌ట్రస్ట్, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో మంతెన సత్యనారాయణరాజు సహకారంతో ఆదివారం ఉచిత బీపీ, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ చల్లా రామ్మోహనరావు పాల్గొని 100 మంది రోగులకు షుగర్, బీపీ వైద్యపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడ మందులను ఉచితంగా అందజేశారు. శిబిరానికి విచ్చేసిన రోగులకు, ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాటూరి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కార్యదర్శి చందు పిచ్చయ్య ఆరె వెంకటేశ్వర్లు, పెనుమెత్స బాపిరాజు, సనకా శ్రీనివాసరావు, బుర్ల బుల్లియ్య, తూనుగుంట్ల లలితబాబు, శ్రీనివాసరెడ్డి, మున్నం శ్రీనివాసరెడ్డి, జిడుగు బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీవీ బహుముఖ ప్రజ్ఞాశాలి

బాపట్ల, ఆగస్టు 4 : జీవి ఉపాధ్యాయుడిగా, చిత్రకారుడిగా సమాజ సేవ తత్పరుడిగా బహుముఖ సేవలందించారని భావపురి పుస్తకోద్యమ సమితి సభ్యులు అన్నారు. జీవీ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం భావపురి పుస్తకోద్యమ సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యులు, రచయితలు, చిత్రకారులు, ఉపాధ్యాయులు పూలమాలలతో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, డాక్టర్ వి.శరత్‌బోస్, సమితి అధ్యక్షులు డాక్టర్ పీసీ సాయిబాబు, శాఖా గ్రంథాలయాధికారి ఎ.శివాజి గణేశన్, రచయత మల్లికార్జున, భావపురి రచయతల సంఘం నాయకులు తిమ్మనశ్యామ్‌సుందర్, చిత్రకారులు తోట వెంకట నారాయణ, ఉమామహేశ్వరరావు, విజయ్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యు జికె.మూర్తి, బాగి కృష్ణమూర్తి, కోలా సుబ్బారావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

బత్తుల శ్రీనివాసరావు సేవలు ఎనలేనవి : ఎంపీటీసీ

కర్లపాలెం, ఆగస్టు 4 : మండలంలోని నల్లమోతువారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన బత్తుల శ్రీనివాసరావు సేవలు ఎనలేనివని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. బత్తుల శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినీ, విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన విద్యనందించటంలో బత్తుల శ్రీనివాసరావు పాత్ర అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

అమృతలూరు, ఆగస్టు 4 : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కూచిపూడి గ్రామానికి చెందిన యలవర్తి సురేష్ గృహంలో అదే గ్రామానికి చెందిన దేవరకొండ సుధారాణి గత 10 సంవత్సరాలుగా పని మనిషిగా చేస్తుంది. ఈ క్రమంలో ఆదివారం ఉతికిన దుస్తులు ఆరవేసేందుకు డాబా పైకి వెళ్లింది. దుస్తులు ఆరవేస్తుండగా ఇంటిపై ఏర్పాటు చేసి ఉన్న సోలార్ వాటర్ హీటర్‌కు వెళ్లే వైరుకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఇంటి యజమాని పోలీసులకు తెలపడంతో ఎస్ఐ నవీన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్రదించండి 99854 11227 99854 02292





ప్రత్యేక అలంకరణలో నవనాగసహిత మానసాదేవి, పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

నవనాగ సహిత మానసాదేవికి విశేష పూజ కార్యక్రమం

బాపట్ల, ఆగస్టు 4 : శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో మఘమాసం అమావాస సందర్భంగా నవనాగసహిత మానసాదేవి అమ్మవారికి విశిష్ట పూజా కార్యక్రమాన్ని ఆదివారం ఆశ్రమ నిర్వాహకులు బాబు నాగేంద్ర ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, అనంతరం మహా మండపారాధన, నవగ్రహ సహిత కాలభైరవ హోమం, క్షేత్రపాలక హోమం, ప్రత్యంగర హోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మ కోసం చెట్టు కార్యక్రమంలో భాగంగా దేవాలయ ప్రాంగణంలో చెట్టును నాటించారు. నవనాగసహిత మానసాదేవి వజ్ర కవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణభట్టు, మామిడి రాజశేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, గుండా శ్రీనివాసరావు, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, సీహెచ్ నారాయణరెడ్డి, బుల్లిరెడ్డి, సంపత్ గణపతిపరివార్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీవోనెంబరు 77ను ప్రభుత్వం రద్దు చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సూళ్ళూరి యచంద్ర

బాపట్ల, ఆగస్టు 4 : జీవో నెంబరు 77ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సూళ్ళూరి యచంద్ర అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బాపట్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలు రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా దీనస్థితికి పడిపోయిందని వెల్లడించారు. గత ప్రభుత్వం జీవో నెంబరు 77 ప్రవేశపెట్టి రాష్ట్రంలో విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేశారని, దీనికి సంబంధించి ఇప్పటి విద్యా శాఖా మంత్రి లోకేశ్ తన యువగళం పాదయాత్రలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జీవో నెంబరు 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని ఆయన తెలిపారు. వైద్య విద్యలో జీవోనెంబరు 107, 108 కారణంగా పేద విద్యార్థులు వైద్య విద్యకి దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆ రెండు జీవోను కూడా ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అశోక్, జగదీష్‌పాల్గొన్నారు.

కాల్వల్లో నీటి మట్టం లేక రైతుల అవస్థలు

చుండూరు, ఆగస్టు 4 : కాల్వల్లో తగినంత నీటిమట్టం లేకపోవడంతో మండలంలోని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యడ్లపల్లి ఛానల్, పర్రా ఛానల్ పరిధిలోని 1500 ఎకరాలకు కాల్వల ద్వారా సక్రమంగా సాగునీరు అందకపోవడంతో వెదసాగు ఎండు దశకు చేరింది. దీంతో రైతులు ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీరు మళ్లించుకుంటున్నారు.

గత నెలలో అధిక వర్షాల వలన వెద కొంతమేర దెబ్బతినగా ఇప్పుడిప్పుడే సాగు భూములు తిరిగి కోలుకుంటున్నాయి. ఈ దశలో కాల్వల్లో తగిన మట్టంలో సాగునీరు లేకపోవడంతో ఎగువ భూముల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాల్వల పరిధిలోని చుండూరు, పెదగాదెలవర్రు, వలివేరు, కారుమూరువారిపాలెం, అంబేద్కర్ నగర్ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే యడ్లపల్లి ఛానల్, పర్రా కాలువలకు తగు మట్టంలో నీటిని విడుదల చేసి వెదసాగును కాపాడాలని రైతులు కోరుతున్నారు.



ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీరు అందిస్తున్న రైతులు

గ్రామాల్లో వైద్యశిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు

అమృతలూరు, ఆగస్టు 4 : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వేమూరు మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్, టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. అమృతలూరులో మెడ్‌స్టార్ హాస్పటల్, గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. సీనియర్ కార్డియాలజీ వైద్యులు బి.విజయ చైతన్య, న్యూరాలజీ వైద్యులు హేమేశ్వరరావులు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. 13 మందికి ఏంజోగ్రామ్ చేయించుకోవాల్సిగా సూచించారు. హాస్పటల్ పీఆర్‌వో రాజేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో శరణుగిరి, సంకర హరికృష్ణ, సర్పంచ్ దేవరకొండ రాము, కొసరాజు దేవకుమార్, మొవ్వా శ్రీనివాసరావు, మూల్పూరు ఏసురత్నం, బొల్లు రామేశం, నార్ల శ్రీను, అమర్తలూరి ప్రభాకరరావు, వినయ్, అజయ్ పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి విజయబాబు

ప్రథమ చికిత్సలో శిక్షణ అత్యవసరం

రేపల్లె, ఆగస్టు 4 : ప్రతి ఆరోగ్య కార్యకర్త విధిగా ఫస్టు ఎయిడ్ శిక్షణను పొందాలని రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ బ్రాంచ్ చైర్మన్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ బ్రాంచ్ కార్యాలయంలో సంజీవని మల్టీస్పెషాలిటీ ఎమర్జెన్సీ కేర్ ఆసుపత్రిలోని ప్రథమ చికిత్సకు సంబంధించి తిరుపతికి చెందిన రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ రత్నశేఖర్ ఆదివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్‌లో నిష్ణాతులుకావాలని, అలాంటప్పుడే సాటి మనిషి ప్రాణాలు పోకుండా అత్యవసర సమయంలో ప్రథమ చికిత్సను అందించవచ్చని ఆవిధంగా వైద్యశాలకు చేరే వరకు అతని ప్రాణాలను కాపాడవచ్చన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ బ్రాంచ్ చైర్మన్ వసంతం వీరరాఘవయ్య

మెగా విరాళం

కేరళ సీఎం సహాయ నిధికి చిరంజీవి, రామ్‌చరణ్ రూ. కోటి, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు





కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి నష్టపోయిన కుటుంబాలకు ఆసరా అందించేందుకు.. కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇప్పటికే పలువురు సినీతారలు విరాళాలు అందించిన సంగతి తెలిసిందే. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కూడా బాధితులు విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళం అందించి, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయాన్ని చాటారు. "ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ఈ ప్రాణ నష్టాన్ని చూస్తుంటే నా గుండె బరువెక్కిపోతోంది. బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం అల్లు అర్జున్ కూడా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. "కేరళలో జరిగిన ఈ సంఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. కేరళ ప్రజలు నాపై ఎంతో ప్రేమ చూపారు. వారి కోసం నా వంతుగా నేను ఈ సహాయం చేస్తున్నాను" అని అల్లు అర్జున్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సంయుక్త మీనన్ కేరళలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న విశ్వశాంతి ఫౌండేషన్‌కు విరాళం అందించినట్లు తెలిపారు. కానీ ఆమె ఎంత మొత్తం అందించారు అనేది గోప్యంగా ఉంచారు.

క్లైమాక్స్‌లో...



చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు యూనిట్ ఆదివారం ప్రకటించింది. 'సినిమా మొత్తం ఒకెత్తు, క్లైమాక్స్ ఒక్కటి మరో ఎత్తు అనేలా ఉండబోతోంది, భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో దర్శకుడు వశిష్ఠ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను దృశ్యకావ్యంలా తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. పతాక సన్నివేశాలకు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు నేతృత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న 'విశ్వంభర' ప్రేక్షకుల ముందు కొస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. త్రిష హీరోయిన్.

విజేతలు వీరే...















దక్షిణాది తారలంతా తళుక్కున మెరిసిన '69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గెలుపు గుర్రాలకు పురస్కారాలను అందించారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిన్నా' అత్యధికంగా ఏడు అవార్డులు కొల్లగొట్టగా.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తి సురేశ్ జంటగా తెరకెక్కిన 'దసరా' చిత్రం ఆరు విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ'.. మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఐదు అవార్డులతో మూడో స్థానంలో నిలిచాయి. తమిళంలో ఉత్తమ నటుడిగా 'పొన్నియన్ సెల్వన్ 2' చిత్రానికి విక్రమ్.. 'మామన్నన్' (నాయకుడు) సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్, ఉత్తమ నటిగా 'చిన్నా' చిత్రానికి నిమిషా సజయన్ ఎంపికయ్యారు. తెలుగువారిని విశేషంగా అలరించిన కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి, ఉత్తమ నటిగా రుక్మిణీ వసంత్ ఎంపికయ్యారు. మలయాళ నటుడు మమ్ముట్టి 'నన్‌పకల్ నేరతు మయక్కం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అవార్డుల ప్రదానోత్సవంలో నాని మాట్లాడుతూ "కెరీర్ తొలినాళ్లలో అవార్డులు అందుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇప్పుడు నేను నటించిన, నిర్మించిన సినిమాల్లోని నటీనటులు ఈ అవార్డులు అందుకుంటుంటే చూడాలని ఉంది. నాతో సినిమాలు తీసిన ఇద్దరు నూతన దర్శకులు అవార్డులు అందుకొన్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "ఓ అభిమాని చేసిన పనిని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఓ అభిమాని.. ఓ రోజు హఠాత్తుగా పెళ్లి చేసుకుంటానని.. ఇంటి వాకిలి ముందు వాలిపోయాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా షాక్ అయ్యా" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, విశాఖ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

తెలుగు సినిమా విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం - బలగం
ఉత్తమ దర్శకుడు - వేణు ఎల్దంది (బలగం)
ఉత్తమ పరిచయ దర్శకుడు - శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
ఉత్తమ దర్శకుడు(విమర్శకుల ఎంపిక) - సాయి రాజేశ్ (బేబీ)
ఉత్తమ నటుడు - నాని (దసరా)
ఉత్తమ నటుడు (విమర్శకుల ఎంపిక) - ప్రకాశ్ రాజ్(రంగ మార్తాండ), నవీన్ పొలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పొలిశెట్టి)
ఉత్తమ నటి - కీర్తి సురేశ్,
ఉత్తమ నటి (విమర్శకుల ఎంపిక) - వైష్ణవి చైతన్య (బేబీ)
ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ), రవితేజ (వాల్తేరు వీరయ్య)
ఉత్తమ సహాయ నటి - రూపా లక్ష్మి (బలగం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - బేబీ
ఉత్తమ గీత రచయిత - అనంత శ్రీరామ్ (బేబీ)
ఉత్తమ నేపథ్య గాయకుడు - శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా - బేబీ)
ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు - సార్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ - సత్యన్ సూరన్ (దసరా).

క్రేజీగా రాంబో



షమ్ము హీరోగా హరీశ్ మధురెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'క్రేజీ రాంబో'. ర్యాప్‌రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించి టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ "టైటిల్ చాలా ఆసక్తికరంగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలి" అని చెప్పారు. హీరో షమ్ము మాట్లాడుతూ "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. "చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని నిర్మాత ర్యాప్‌రాక్ షకీల్ అన్నారు.

స్కూల్ లైఫ్‌ను గుర్తుకు తెచ్చేలా



ప్రియదర్శి, విశ్వదేవ్, భాగ్యరాజ్, నివేత థామస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సయ్యారే సయ్యా' పాటను విడుదల చేశారు. అందరికీ స్కూల్ లైఫ్ జ్ఞాపకాలను, బాల్య స్నేహాలను గుర్తుకు తెచ్చేలా సాగిందీ పాట. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, కార్తీక్ ఆలపించారు. వివేక్ సాగర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: టి.సి.ప్రసన్న, డీఓపీ: నికేత్ బొమ్మి.



డబుల్... కిక్ ఇచ్చింది

'కమర్షియల్ సినిమా అంటే గుర్తుకొచ్చేది పూరి జగన్నాథ్. ఆయన ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఎక్కువ సమయం, కష్టం పెట్టిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. స్క్రిప్ట్ విన్నప్పుడు ఎంత కిక్ వచ్చిందో, ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నప్పుడూ అంతే కిక్ ఇచ్చింది. త్వరలో థియేటర్లలో కలుద్దాం' అని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. పూరి జగన్నాథ్ వీడియో సందేశంలో మాట్లాడుతూ 'వైజాగ్ గల్లీల్లో తిరిగినవాణ్ణి. నేను తీసిన గల్లీ సినిమా ఇది. సీ సెంటర్లలో విజిల్స్ వేస్తూ చూడండి' అని ప్రేక్షకులను కోరారు. థియేటర్‌కి పట్టిన తుప్పును వదలగొట్టే సినిమా ఇదని అలీ అన్నారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ కావ్యథాపర్ చెప్పారు.

గొప్ప సినిమాగా నిలిచిపోతుంది



తాజాగా...

"తంగలాన్' వందేళ్ల క్రితం జరిగిన కథ. అందమైన సాహసోపేత ప్రయాణం ఈ సినిమా. మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఈ సినిమా గురించిన ముఖ్యమైన విషయాలేవి బయటకు చెప్పలేదు. నా కెరీర్‌లో అత్యుత్తమ పాత్రను ఈ సినిమాలో చేశాను' అని హీరో విక్రమ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా పా రంజిత్ రూపొందించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. పా రంజిత్ మాట్లాడుతూ 'మనదేశంలో అణచివేత, అసమానత్వం ఇంకా ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు నేను సినిమాను మాధ్యమంగా ఎంచుకున్నాను. నా గత చిత్రాల్లానే 'తంగలాన్'ను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. తంగలాన్ ప్రచార చిత్రాల్లో మా కష్టం కనపడుతోంది అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు.

సందేశాన్నిచ్చే 'సింబా'



జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకత్వంలో సంపత్ నంది, దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ "ఇది ప్రకృతి మీద ఉన్న ప్రేమతో తీసిన సినిమా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అని తెలిపారు. నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇస్తుంది. ఇది సమాజం కోసం తీసిన సినిమా" అని అన్నారు. "సినిమా చాలా కొత్త పాయింట్‌తో ఉంటుంది. సంపత్ నంది అద్భుతమైన కథను ఇచ్చారు" అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. "వనజీవి రామయ్య' జీవితం ఆధారంగా ఈ కథను రాసుకున్నారు సంపత్ నంది" అని నిర్మాత దాసరి రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఆ 67 కోట్లు వదిలేస్తారా?



- ఈ-ఆటో కొనుగోళ్లలో ఎస్సీ కార్పొరేషన్ సొమ్ము స్వాహా
- అడ్వాన్స్ తీసుకుని సరఫరా చేయని డీలర్లు
- అడ్వాన్స్ తిరిగి చెల్లించకపోయినా పట్టించుకోని గత ప్రభుత్వం
- వారికి అండదండలందించిన ఓ ఐఏఎస్ అధికారి
- ఇప్పుడైనా వసూలు చేస్తారో లేదో!

> వైసీపీకి ముఖ్యుడైన ఆ ఐఏఎస్ అధికారి కారణంగా ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.67 కోట్లు గండిపడింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను అప్పనంగా ఓ డీలర్‌కు ఇచ్చేశారు. ఈ-ఆటోల కొనుగోలు కోసం అడ్వాన్స్ చెల్లించినా ఆ డీలర్ ఆటోలు సరఫరా చేయకపోగా, తిరిగి ఆ సొమ్మును కూడా ప్రభుత్వానికి వాపసు చేయకపోవడం దారుణం. అడ్వాన్స్‌లు ఇచ్చింది గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయినా... గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ డీలర్ల నుంచి ఆ సొమ్మును వసూలు చేయలేకపోవడానికి ఆ అధికారే కారణమని చెప్తున్నారు. ప్రస్తుతం రిటైర్ అయిన ఆ అధికారి ఆ డీలర్ ఆ అధికారికి బినామీనేనని... అందుకే గతంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులుగా పనిచేసిన పినిపె విశ్వరూప్, మేరుగ నాగార్జునలు కూడా డీలర్‌కు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి రాబట్టుకునేందుకు విఫలయత్నాలు చేశారన్న అపవాదు ఉంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు చేసే క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి వాటిని ఘనవ్యర్థాల షెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువులు తయారుచేయాలనేది లక్ష్యం. అందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను ఎస్సీ యువత ద్వారా కొనుగోలు చేసి వాటిని చెత్తను తరలించేందుకు గ్రామ పంచాయతీల్లో వినియోగించాలని నిర్ణయించారు. 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థిక అభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ), జాతీయ ఎస్సీ ఆర్థిక అభివృద్ధి సంస్థ నిధులు(ఎన్ఎస్ఎఫ్‌డీసీ) వాడుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా అప్పటి ఉమ్మడి 13 జిల్లాల్లో 13 ఈ-ఆటో సర్వీసు కేంద్రాలను ప్రారంభించాలని, భవిష్యత్తులో 42 సర్వీసు కేంద్రాలుగా విస్తరించాలని ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అప్పట్లో ఈ-ఆటోలను సరఫరా చేసేందుకు పుణెకు చెందిన కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ ఆథరైజేషన్‌తో తాడేపల్లికి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్ ఒప్పందం చేసుకుంది. ఈమేరకు 7500 పవర్ ఆటోలు సరఫరా చేయాలని ఒప్పందం చేసుకుని రూ.77.91 కోట్లు అడ్వాన్స్‌గా పొందారు. కొనుగోలు ఆర్డర్‌ను ఎస్సీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ ఇచ్చారు. అయితే అనిల్‌కుమార్‌రెడ్డి రూ.57.98 కోట్ల విలువ కలిగిన 2,550 వాహనాలు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 4,950 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్ ఇంకా రూ.19.92 కోట్లు ఆయన వద్దనే మిగిలిపోయింది. అనిల్‌కుమార్‌రెడ్డి ఈగల్ అగ్రి ఎక్విప్‌మెంట్, కావలి పేరుతో 280 మెకనైజ్డ్ డ్రైయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.23.72 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.14.27 కోట్లు విలువ కలిగిన 209 మెషిన్లు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 71 మెషిన్లు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ అవి సరఫరా చేయకపోగా తిరిగి చెల్లించాల్సిన రూ.9.45 కోట్లు కోట్లు తిరిగి చెల్లించలేదు. ఇదే కంపెనీ 660 ట్రాక్టర్లు సరఫరా చేస్తామని రూ.38.87 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.26.56 కోట్లు విలువ కలిగిన 451 ట్రాక్టర్లు మాత్రమే సరఫరా చేశారు. తిరిగి చెల్లించాల్సిన రూ.12.31 కోట్లు డీలర్ వద్దనే ఉన్నాయి. వెరసి ఒక్క అనిల్‌కుమార్‌రెడ్డి వద్దనే రూ.41.68 కోట్లు నిలిచిపోయాయి. ఇదే రకంగా మరో డీలర్ రాధా మాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1647 ఇన్నోవాలు ఇతియోస్ వాహనాలు సరఫరా చేస్తామని రూ.221.64 కోట్లు అడ్వాన్స్ తీసుకుంది. రూ.198.59 కోట్ల విలువ కలిగిన1417 వాహనాలు సరఫరా చేసింది. ఇంకా 230 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్‌లో రూ.23.05 కోట్లు డీలర్ వద్దనే నిలిచిపోయింది. తిరిగి చెల్లించడం లేదు. అప్పటి ధరల ప్రకారం వాహనాలు ఇవ్వలేమని, పెరిగిన ధరల ప్రకారం తీసుకునేందుకు అంగీకరిస్తే పరిశీలిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎంట్రాన్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15 మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.3.52 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకుని 6 మెషిన్లు సరఫరా చేసింది. ఇంకా 9 వాహనాలు సరఫరా చేయలేదు. వారు తీసుకున్న అడ్వాన్స్ ఇంకా రూ.2.93 కోట్లు ఆ కంపెనీ వద్దనే మిగిలి ఉంది. మొత్తంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మొత్తం రూ.67.67 కోట్లు అడ్వాన్స్ ఎస్సీ కార్పొరేషన్‌కు తిరిగి చెల్లించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో కెనటిక్ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుంచి రూ.7.72 కోట్లకు గాను ఐసీఐసీఐ బ్యాంక్ జారీచేసిన ఈఎండీని సమర్పించారు. ఈ ఈఎండీ బ్యాంక్ గ్యారెంటీ జనవరి 24, 2022 వరకు గడువు ఉండేట్లు తీసుకున్నారు. ఈ బ్యాంక్ గ్యారెంటీని సమర్పించిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌కు లేఖ రాస్తూ మొత్తం సరఫరా చేసే ఈ-ఆటోల విలువలో 25 శాతం మొత్తంతో పాటు రూ.1.50 కోట్ల ఈఎండీ మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్‌కు సంస్థ లేఖ రాసింది. ఈ చెల్లింపులు సంస్థ ఆథరైజ్డ్ డీలర్ వెంకటేశ్వర ట్రేడర్స్‌కు చెల్లించాలని ఆథరైజ్ చేసింది. అయితే ఆ తర్వాత కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సమర్పించిన బ్యాంక్ గ్యారెంటీ నకిలీదని తేలింది. దీనిపై ఎన్ని నోటీసులిచ్చినా వెంకటేశ్వర ట్రేడర్స్ లెక్కచేయలేదు. ఆ తర్వాత మంత్రి విశ్వరూప్ పదవి మారడంతో కొత్తగా వచ్చిన మంత్రి మేరుగ నాగార్జున కూడా అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని డీలర్లకు హెచ్చరించడంతో ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగారు. సీఎం కార్యాలయం నుంచి, ప్రభుత్వ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో అడ్వాన్స్ తిరిగి చెల్లించే ప్రక్రియ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఈ-ఆటోలను, ఇన్నోవాలను సరఫరా చేయని డీలర్ నుంచి అడ్వాన్స్‌ను తిరిగి రాబట్టడంలో సాక్షాత్తు ఆ శాఖ మంత్రులే విఫలమవ్వడం వెనుక ఆ ఉన్నతాధికారి హస్తముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జగన్ సర్కార్‌లో ఆ అధికారి కీలకంగా ఉన్నారని, ఆయన మాట చెల్లుబాటు కావడంతోనే ఐదేళ్ల పాటు ఈ అవినీతిని కప్పిపుచ్చుకోగలిగారని పేర్కొంటున్నారు.

సీఎం గారూ.. దయ చూపరూ!

- చంద్రబాబుకు ఖైదీల కుటుంబాల వేడుకోలు
- రెండున్నరేళ్లుగా 160 మంది సత్ప్రవర్తన ఖైదీల నిరీక్షణ
- తాజాగా ఏపీ సర్కారుకు జైళ్లశాఖ ప్రతిపాదనలతో ఆశలు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలిసో తెలియకో.. పొరపాటునో.. క్షణికావేశంలోనో.. తప్పు చేసిన తమ వారిపై దయచూపండి చంద్రబాబు గారూ అంటూ రాష్ట్రంలోని పలు జైళ్లలో మగ్గుతున్న ఖైదీల కుటుంబాల సభ్యులు ముఖ్యమంత్రిని వేడుకొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు ఖైదీల విడుదలకు ఏమాత్రం అవకాశం లేకపోవడంతో, సత్ప్రవర్తన కలిగినప్పటికీ తమవారు ఇంకా జైళ్లలోనే మగ్గుతున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బాధిత ఖైదీల కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. వాస్తవానికి.. ఖైదీలను ప్రతి ఆర్నెళ్లకోసారి జూన్ 30లోపు మొదటి, డిసెంబరు 31లోపు రెండో జాబితా ఎంపిక చేసి విడుదల చేయాలని సుప్రీం కోర్టు 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు పంపింది. కొవిడ్ అనంతర పరిణామాలతో దేశ అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అటు కేంద్ర ప్రభుత్వం, దేశంలోని రాష్ట్రాలు సమ్మతించాయి. అయితే మన రాష్ట్రంలో నియంతలా పాలించిన జగన్ రెడ్డి అవేవీ పట్టించుకోలేదు. సుప్రీం కోర్టుతో ఇబ్బందులు వస్తాయని జైళ్ల శాఖ అధికారులు చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారు. పిట్టకథలు చెప్పడంలో పేరుగాంచిన రాయలసీమ మాజీ మంత్రి తమ బంధువులను విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించారు. అయితే సుప్రీం కోర్టు మార్గదర్శకాల పరిధిలోకి ఆ ఖైదీలు రాబోరని జైళ్ల శాఖ అధికారులు చెప్పడంతో అర్హులైన వారిని సైతం విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. అయినప్పటికీ ప్రతి ఆర్నెళ్లకోసారి అర్హుల జాబితా సుప్రీం మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి ప్రభుత్వానికి జైళ్ల శాఖ పంపింది. కోర్టుతో ఇబ్బందులు రాకుండా 2022లో ఒకసారి హోంశాఖ జీవో ఇచ్చింది తప్ప ఖైదీలను విడుదల చేయలేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా జూన్ 30నాటికి ఏ జైలులో ఏ ఖైదీ అర్హుడో వివరిస్తూ 160మంది జాబితా వారం రోజుల క్రితం చంద్రబాబు ప్రభుత్వానికి ఏపీ జైళ్లశాఖ పంపింది. ఆగస్టు 15, జనవరి 26తో సంబంధం లేకుండా ఎప్పుడైనా విడుదల చేయవచ్చని ప్రతిపాదనల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయబోయే ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గం సిద్ధం చేసింది. వీరికిఉపాధి కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా జైళ్ల శాఖ పంపిన జాబితా ప్రకారం విడుదలకు అర్హులైన ఖైదీలు.. కోస్తాంధ్ర జైళ్లలో 72మంది, గుంటూరు రేంజ్ పరిధిలో 35మంది, రాయలసీమ జైళ్లలో 53మంది కలిపి మొత్తం 160 మంది ఉన్నారు.

నిస్తేజంలో రవాణా శాఖ



- ప్రజల సహనానికి 'వాహన్-పరివాహన్' పరీక్ష
- ఆన్‌లైన్ సేవల్లో గందరగోళం.. ఆగిపోయిన ఈ ప్రగతి
- ఆగిన ఐటీ ప్రాజెక్టులు.. తిరోగమనంలో రవాణా రంగం

అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటిన్నరకు పైగా వాహనాలు... నాలుగున్నర వేల కోట్ల ఆదాయం... ఐదు కోట్ల మంది ప్రజలకు రవాణా సర్వీసులు... వేలాది రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు.. ఇంతటి కీలకమైన రవాణా శాఖ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అనాథలా ఉంది. ఆన్‌లైన్‌లో సేవలు గందరగోళంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం సర్వీసు చార్జీ చెల్లించక పోవడంతో ఐటీ విభాగం అస్తవ్యస్తమైంది.. వాహన్-పరివాహన్ మూడేళ్లుగా విజయవాడలో పైలట్‌కే పరిమితం కావడంతో సేవల పొందాలంటే తలప్రాణం తోకలోకి వస్తోంది. 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ఏకంగా 83రకాలా ఆర్టీఏ సేవలు ఆన్‌లైన్లో అందేవి.. డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ట్రాక్‌లో టెస్ట్ కోసం దరఖాస్తుదారు వెళ్లాలి. వాహనమైతే ఫిట్ నెస్ కోసమే ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. మిగతా అనుమతులు, పన్నులు, ఇతర సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండేవి. ప్రజలు వాటికి అలవాటు పడి ఇప్పుడు ఈ ప్రగతి ద్వారానే చెల్లింపులు, సర్వీసులు పొందేవారు. వాహన డీలర్లు, ఫైనాన్సియర్లు, ఉత్పత్తిదారులు అందరూ ఆన్‌లైన్‌లోనే అన్నీ పూర్తి చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రగతిని ఆపేసింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్సీ కార్డుల సరఫరా నిలిపేసింది. రాష్ట్రంలో రవాణా రంగమే తిరోగమనం బాట పట్టింది. ఇటు రవాణా శాఖ కమిషనర్ ఎంకె. సిన్హా హైదరాబాద్ నుంచి విజయవాడలోని ఆఫీసుకు మంగళవారం వచ్చి శుక్రవారం మధ్యాహ్నం నుంచే వెళ్లిపోతుండటం, సంబంధిత శాఖ మంత్రి కూడా సమీక్షించక పోవడంతో ఆ ప్రభావం రవాణా సిబ్బంది పనితీరుపై చూపుతోంది. లారీ యజమానులు కమిషనర్ వద్దకెళ్లి తమ సమస్య చెబితే అవన్నీ భరించాలి తప్పదని ఆయన సమాధానం ఇవ్వడంతో దిక్కుతోచక వెనక్కి తిరిగొచ్చారు. ఐటీ విభాగంలో మ్యాన్ పవర్ సర్వీసెస్‌కు డబ్బులు ఇవ్వకపోగా ఏడాది నుంచి కనీసం రెగ్యులర్ చేయట్లేదు. ఫలితంగా మెన్‌పవర్ సర్వీసులో ఉద్యోగులు మానేసి వెళ్లిపోతుండటంతో రవాణా సేవలకు బ్రేక్ పడింది.

ఐటీ ప్రాజెక్టులన్నీ బంద్...

రవాణా సేవలన్నీ ఇంటి నుంచే ప్రజలు పొందేందుకు ఆ శాఖలో ఐటీ విభాగం కీలకంగా పనిచేసేది. రవాణా వాహన యజమానులు తాత్కాలిక అనుమతి తీసుకోవాలన్నా, త్రైమాసిక పన్నులు చెల్లించాలన్నా ఐటీ విభాగం పనితీరుతోనే ముడిపడి ఉండేది. ఇలా ఐటీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే చంద్రబాబు ప్రభుత్వంలో వాహన ట్రాకింగ్ సిస్టమ్ తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రం కూడా కోట్లాది రూపాయల నిధులు తమ వాటాగా ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి ఐదు కోట్ల రూపాయలు మూడేళ్ల క్రితమే విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయక పోవడంతో ఏ వాహనం ఎక్కడుందో తెలిసేలా ఆర్టీఏ తీసుకు రావాలనుకున్న ప్రాజెక్టు షెడ్డుకు చేరింది.

ఆగిపోయిన అభయ

ఆడబిడ్డలకు ఆపదొస్తే గన్ కన్నా ముందుగా జగన్ వస్తాడంటూ ఆయన అనుయాయులు పదే పదే చెప్పేవారు. అయితే ఆటోల్లో ప్రయాణించే మహిళలు, యువతుల రక్షణ కోసం అభయ(ఆటో, ట్యాక్సీ ప్రయాణాల్లో ఆపదొస్తే నొక్కే బటన్) ప్రాజెక్టు కోసం కేంద్రం 50కోట్లు విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం కొంత మ్యాచింగ్ ఇచ్చేందుకు మనసురాక ప్రాజెక్టునే పట్టించుకోకుండా వదిలేసింది. ఇలాంటివి చూసుకోవాల్సిన ఐటీ విభాగం అధికారి శ్రీదేవి ఏడాది పాటు సెలవులో వెళ్లారు. డబ్బులివ్వకుంటే నేను సర్వీసు ఇవ్వలేనంటూ ఐటీ మెన్ పవర్ కాంట్రాక్టరు గోడు వెళ్లబోసుకొంటున్నట్లు సమాచారం. మరోవైపు వాహన్-పరివాహన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండానే ఈ ప్రగతి ఆపేయడంపై విజయవాడలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవయవాల రవాణా సమయంలో
ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

వైద్య సిబ్బందికి రిజర్వేషన్, ముందు సీట్లు కేటాయించాలి.. కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: అవయవ దానంతో మరొకరికి ప్రాణదానం చేయొచ్చు. అయితే.. అవయవ దాత, గ్రహీత వేర్వేరు నగరాల్లో లేదా రాష్ట్రాల్లో ఉన్నప్పుడు సజీవ అవయవాన్ని వీలైనంత త్వరగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఆలస్యం జరిగినా ప్రయత్నమంతా వృథా అవుతుంది. అందుకే అవయవ రవాణాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అవలంబించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. విమానాలతో సహా వివిధ ప్రయాణ మార్గాల ద్వారా అవయవాలను అత్యంత వేగంగా రవాణా చేసేందుకు ఈ ఎస్ఓపీ వీలుకల్పిస్తుంది. నీతి ఆయో గ్, నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఈ తరహా ఎస్ఓపీని రూపొందించింది. విమానాల్లో అవయవాలు రవాణా చేసే సమయంలో టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడడం, వైద్య సిబ్బందికి ప్రాధాన్య రిజర్వేషన్, ముందు వరుస సీట్లను కేటాయించడం, ఎయిర్‌పోర్టుకు చేరుకునే క్ర మంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రీన్ కారిడార్ ఏర్పాటు వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. అలా గే అంబులెన్స్, ఇతర రవాణా మార్గాల ద్వారా అవయవాల రవాణాను సులభతరం చేయడానికి నిర్దిష్ట అధికారులు లేదా ఏజెన్సీల అభ్యర్థన మేరకు గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయవచ్చని దీనిలో పేర్కొన్నారు. రాష్ట్రంలోగానీ, ఒక నగరంలోగానీ అవయవ రవాణా కోసం 'గ్రీన్ కారిడార్' ఏర్పాటుకు సమ్యలేమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు పోలీస్ శాఖకు చెందిన ఒక నోడల్ అధికారిని నియమించవచ్చని సూచించారు.



పోకిరీల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

పోకిరీల పనిపట్టారు!

- మైనర్ బాలికను వేధించిన ఇద్దరు యువకులు
- స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ దామోదర్
- తాలూకా పోలీసుల అదుపులో నిందితులు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 4 : బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులను ఉపేక్షించేది లేదని బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే హెచ్చరించిన ఎస్పీ దామోదర్ ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కేసులపై ఆయన వెంటనే స్పందిస్తున్నారు. స్వయంగా రంగంలోకి కూడా దిగుతున్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో మైనర్ బాలిక నూడిల్స్ తెచ్చుకునేందుకు వెళుతుండగా ఇద్దరు పోకిరీలు పూటుగా మద్యం సేవించి బైక్‌పై వెంటపడ్డారు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బయటకు వచ్చి కాపాడారు. అదేసమయంలో ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో నేరుగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులను విచారించారు. అదేసమయంలో అక్కడికి వచ్చిన తాలూకా పోలీసులు నిందితులైన చంద్రయ్యనగర్‌కు చెందిన ఎద్దూరి జయదీప్, ఎర్రగుంట్ల అనూక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఇద్దరు యువకులపై రౌడీషీట్లు తెరుస్తామని చెప్పారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీలు, గంజాయి బ్యాచ్‌పై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎన్‌జీవో కాలనీలో పోలీసు గస్తీ పెంచుతామని స్థానికులకు తెలిపారు. మరోవైపు ఇద్దరు యువకులకు స్టేషన్‌లో పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకు ఎస్పీ ఒంగోలులోని దిశ పోలీసు స్టేషన్ తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో ఓ మహిళ ఆయన్ను కలిసి తన కుమార్తెను ఓ యువకుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన తనభర్తపై ఆ యువకుడు స్నేహితుడితో కలిసి దాడి కూడా చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే ఎస్పీ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



గ్రామస్థులు, మహిళలతో మాట్లాడుతున్న పోలీస్ అధికారి

సింథైట్ వద్ద గ్రామస్థుల ఆందోళన

- కోరు భరించలేమంటూ నిలదీత
- దౌర్జన్యానికి దిగిన ఫ్యాక్టరీ అధికారులు

మేదరమెట్ల, ఆగస్టు 4 : మేదరమెట్ల గ్రామస్థులు సింథైట్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగారు. పదేళ్లుగా ఈ కోరును భరించలేకపోతున్నామని, మూడు రోజు నుంచి కోరు మరి విపరీతంగా వస్తోందని, వెంటనే ఫ్యాక్టరీని ఆపాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులపై ఫ్యాక్టరీ అధికారులు దౌర్జాన్యానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, అలాగని మా జీవితాలను పణంగా పెట్టలేమన్నారు. 12వేల మందికి పైగా జనాభా ఉన్న మేదరమెట్లకే ఈ కోరు పరిమితం కాలేదని, చుట్టు పక్కల ఉన్న తమ్మవరం, అనమనమూరు, తిమ్మనపాలెం గ్రామాల ప్రజలు కూడా కోరుతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎన్నిసార్లు ఫ్యాక్టరీకి వెళ్లి మా బాధలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. రెండుమూడు రోజులు తాత్కాలిక పరిష్కారం తప్ప శాశ్వత పరిష్కారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇన్‌చార్జి కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఆర్‌డీవో తదితర జిల్లా స్థాయి అధికారులు ఫ్యాక్టరీలలో పరిశీలన చేశారు. పరిశీలినలో అనేక ఉల్లంఘనలు వారి దృష్టికి వచ్చాయి. సమస్యపై అడగడానికి వెళ్లిన గ్రామస్థులపై ఫ్యాక్టరీ అధికారులు, సిబ్బంది దౌర్జాన్యాలకు పాల్పడడం పరిపాటిగా మారుతోందన్నారు. ఆదివారం కోరును తట్టుకోలేక మహిళలు, గ్రామస్థులు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. అధికారులతో మాట్లాడుతున్న సమయంలో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు గ్రామస్థులపై దౌర్జన్యానికి పాల్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీ ముందు గ్రామస్థులు నిరసన చేపట్టేందుకు టెంట్‌లు వేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్థులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీతో పాటు ఎస్‌ఐలు చంద్రశేఖర్, శివయ్య, తిరుపతిరావుతోపాటు జర్నలిస్టులు ఎవరినీ ఫ్యాక్టరీలోకి అనుమతించలేదు.

నేడు కలెక్టర్ల సదస్సు

- భవిష్యత్‌పై దిశానిర్దేశం చేయనున్న సీఎం
- జిల్లా అంశాలపై నివేదికలతో హాజరవుతున్న అన్సారియా

ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి జిల్లా కలెక్టర్ల సదస్సును సోమవారం నిర్వహిస్తోంది. సాధారణంగా రెండు రోజులు నిర్వహించే ఈ సమావేశాన్ని ఈసారి ఒక్క రోజుకే పరిమితం చేశారు. ఉదయం 10 నుంచి నుంచి రాత్రి 8గంటల వరకూ నిరాటంకంగా సాగేలా షెడ్యూల్‌ను రూపొందించారు. అమరావతిలోని సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చే అంశాలు, విభిన్నవర్గాల ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, జిల్లాల వారీ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానమైన వ్యవసాయం, నీటి పారుదల, సహజవనరులు, పట్టణ, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ మానవ వనరుల అభివృద్ధి, సంక్షేమం వైద్యం తదితర తొమ్మిది రంగాలకు సంబంధించి 28 శాఖలపై సమీక్షించేలా అజెండా రూపొందించారు. రాత్రి ముగింపు సమయంలో శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఆమేరకు ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఆయా రంగాలు, శాఖల వారీ సమగ్ర నివేదికలను రూపొందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం సమావేశంలో అందజేయనున్నారు. జిల్లాకు కలెక్టర్‌గా కొద్దిరోజుల క్రితమే వచ్చిన ఆమె.. ఆయా రంగాలు, శాఖల వారీ ఒకవైపు సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలలో పలు అంశాలను గుర్తించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. రాత్రి ముగింపు సమయంలో శాంతిభద్రతలపై జరిగే సమీక్షకు ఎస్పీ దామోదర్ కూడా హాజరుకానున్నారు.

‘క్లీన్’గా దోపిడీ

వైసీపీ పాలనలో క్లాప్ పేరుతో రూ. లక్షలు కైంకర్యం

మాజీ సీఎం సామాజికవర్గానికి చెందిన సంస్థకు చెత్తసేకరణ బాధ్యతలు

దానికి లబ్ధి చేకూర్చేందుకు ప్రజల నెత్తిన పన్ను భారం

మరమ్మతులకు గురై మూలనపడిన వాహనాలు

సిబ్బంది వేతనాల్లోనూ కోత

నగర వాసులకు తీరని చెత్త కష్టాలు

అయినా ఏజెన్సీకి నెలకు రూ.25లక్షలు చెల్లిస్తున్న కార్పొరేషన్ అధికారులు

పారిశుధ్యం మెరుగు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)ను తెచ్చి సొంతవారికి లబ్ధి చేకూర్చింది. క్లీన్‌గా దోచిపెట్టింది. అప్పటి సీఎం సామాజికవర్గానికి చెందిన రెడ్డి అండ్ రెడ్డి ఏజెన్సీకి చెత్త సేకరణ బాధ్యతలు అప్పగించి అప్పనంగా రూ.కోట్లు కుమ్మరించింది. నగర జనం నెత్తిన చెత్తపన్ను భారం మోపి ఆ మొత్తాన్ని సదరు ఏజెన్సీకి చెల్లించింది. అయితే ఆ సంస్థ నిర్వాహకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. తొలుత నగరంలో చెత్తసేకరణకు 60 వాహనాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణను గాలికొదిలేశాడు. దీంతో అత్యధికం మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. డ్రైవర్‌లకు నెలకు రూ.12 వేలవేతనం అంటూ పనిలోకి పెట్టుకుని రూ.9వేలు చెల్లిస్తూ వారి శ్రమను దోచేశారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు ప్రజల నుంచి నెలనెలా పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.38లక్షలను సదరు ఏజెన్సీకి చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటింటి చెత్త పన్ను వసూళ్లు నిలిపివేసింది. వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, ఇతరత్రా వ్యాపార దుకాణాల నుంచి పన్ను వసూలు మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. ఎక్కువ వాహనాలు తిరక్కపోయినా, ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించకపోయినా నెలనెలా చెత్తపన్ను ద్వారా వచ్చిన మొత్తాన్ని అధికారులు ఇప్పటికీ సదరు ఏజెన్సీకి ముట్టజెప్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 4 : గత వైసీపీ పాలనంతా అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లు సాగింది. పార్టీ నేతలకు ప్రజాధనాన్ని దోచిపెట్టడమే ధ్యేయం అన్నట్లు నడిచింది. చివరికి చెత్త సేకరణనూ సొంత వారికి ఆదాయమార్గంగా మార్చింది. క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అంటూ ప్రజలపై పన్నుల భారం మోపి ఆ సొమ్మును పందేరం చేసింది. ఒంగోలు నగర పాలక సంస్థలో క్లాప్ తీరును పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 2022 మార్చి నుంచి ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే అప్పటి నుంచి పారిశుధ్యం మెరుగు ఆటుంచితే భారీగా నిధుల మేత జరిగినట్లు స్పష్టమవుతోంది.

సొంత వారికి బాధ్యతలు

క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఇంటింటి చెత్త సేకరణను గత ప్రభుత్వం చేపట్టింది. అంతకుముందు ఎప్పుడూ లేని విధంగా చెత్తపై పన్ను విధించి ప్రజలపై ఆర్థికభారం మోపింది. బడి, గుడి, ఇల్లు, వాకిలి, హోటళ్లు, లాడ్జిలు, ఆసుపత్రులు, అన్నదాన సత్రాలు ఇలా ఒకటేమిటీ ప్రతి దాని నుంచీ చెత్తపన్ను వసూలు చేసింది. చెత్త సేకరణ బాధ్యతను సీఎం సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ఏజెన్సీకి అప్పగించింది. ఒప్పందం ప్రకారం సదరు ఏజెన్సీ వాహనాలను సమకూర్చుకొని ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉంటుంది. అందుకోసం డ్రైవర్‌ను నియమించుకోవాలి. ఆయనే అన్ని పనులూ చేయాలి. కానీ ఒంగోలులో కార్పొరేషన్ అధికారులు ఏజెన్సీకి అన్ని విధాలా సహకరించారు. చెత్తసేకరణ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ సిబ్బందిని కేటాయించడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది.

కదల్లేక కార్పొరేషన్ కార్యాలయంలో వాహనాలు

డ్రైవర్లకు వేతనాలు, వాహనాల నిర్వహణ, వాటి మరమ్మతులు, టైర్లు, ఇంజన్ ఆయిల్, క్లచ్ ప్లేట్‌లు, ఇతర మెయింటినెన్స్ రెడ్డి ఏజెన్సీనే చూసుకోవాలి. కానీ ఆరంభంలో 60 వాహనాలను ఏర్పాటు చేసిన ఆ సంస్థ ఆతర్వాత వాటి గురించి అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా కొద్దిరోజులు ఆయిల్‌కు కూడా డబ్బులు ఇవ్వలేదు. ప్రస్తుతం వాహనాల్లో దాదాపు 40కిపైగా మరమ్మతులకు గురై కనీసం కదలలేని స్థితిలో కార్పొరేషన్ కార్యాలయానికే పరిమితమయ్యాయి. మరికొన్ని మూలుగుతూ, ముక్కుతూ రోడ్డెక్కుతున్నాయి. అయితే వాటి నిర్వహణ బాధ్యతపై అధికారులకు ఎలాంటి సంబంధం లేకపోవడంతో నగర పాలక సంస్థ నిధుల నుంచి ఖర్చు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు వాహన డ్రైవర్లే వాటికి మరమ్మతులు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నెలకు తమకు వచ్చే రూ.9వేల వేతనంలో రెండు, మూడు వేలు రిపేరుకే ఖర్చవుతున్నదని, ఇక తాము తినేది ఏమిటని డ్రైవర్లు వాపోతున్నారు. దీంతో కొందరు వాహనాలు నడపలేమంటూ కార్పొరేషన్‌లో వదిలేయగా, మరికొన్నింటిని అధికారులు జోక్యంతో ఎలాగోలా తిప్పుతున్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద మూలనపడిన చెత్త వాహనాలు

వాహన డ్రైవర్లకు మొండిచెయ్యి

పారిశుధ్యం పేరుతో చెత్తసేకరణ వాహనాలకు డ్రైవర్లుగా విధుల్లోకి తీసుకున్న వారి సంక్షేమాన్ని ప్రైవేటు సంస్థ విస్మరించింది. క్లాప్ కింద విధుల్లోకి తీసుకున్న వారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాదు. అలాగని కాంట్రాక్ట్ కార్మికులూ కాదు. రోజువారీ కూలీలుగా తీసుకుని వారికి చెందాల్సిన కార్మిక చట్టాలను ఏజెన్సీ తుంగలో తొక్కింది. మరోవైపు ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ కూడా లేకుండా చేసింది. క్లాప్ పేరుతో కోట్లు రూపాయలు దండుకున్న సంస్థ అటు వాహనాల నిర్వహణ, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం గత వైసీపీ పాలనలో అడ్డగోలు తీరుకు అద్దం పడుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ చెత్తపన్ను వసూళ్లను నిలిపివేసింది. కేవలం హోటళ్లు, ఆసుపత్రులు, లాడ్జిలు, ఇతరత్రా వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి మాత్రమే పన్ను వసూలు చేస్తున్నారు. ఏజెన్సీ ఏర్పాటు చేసిన వాహనాల్లో అత్యధికంగా మరమ్మతులకు గురవడంతో నగరంలో చెత్తసేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు సదరు ఏజెన్సీని కొనసాగించడం, నెలనెలా వసూలు చేస్తున్న పన్నును ఆ సంస్థకు చెల్లించడం ఆరోపణలకు తావిస్తోంది.

ఆశా‘జలం’

నిండుకుండలా శ్రీశైలం, అదేస్థాయిలో సాగర్ డ్యాం

ఇప్పటికే సాగర్ జోన్-1కు నీటి విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

నేడు గేట్లు ఎత్తే అవకాశం

ఉమ్మడి జిల్లాలో 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు



నిండుకుండలా సాగర్ జలాశయం

ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు ప్రధాన వనరుగా ఉన్న సాగర్ నీటి సరఫరాపై రైతులు ఆశతో ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడిచినా సరైన వర్షాలు లేక పంటలు సాగు ముందుకు కదలలేదు. సాధారణ సాగు విస్తీర్ణంలో 20శాతం కూడా ఇంకా విత్తనం పడలేదు. అంతేకాక ఎండల తీవ్రత పెరిగి వేసవిని తలపిస్తుండటంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో కృష్ణానది పరవళ్లు భరోసా కలిగించాయి. పది రోజుల్లోనే శ్రీశైలం జలాశయం నిండటంతోపాటు సాగర్ డ్యాం కూడా నిండిపోయే పరిస్థితికి రావడం ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో సాగుపై రైతుల్లో నమ్మకం పెంచింది.

సాగు, తాగుకు సాగర్ నీరే ప్రధాన ఆధారం

ఉమ్మడి జిల్లాలో సాగర్ కాలువల పరిధిలో సుమారు 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా నీరు అందితే సగం విస్తీర్ణంలో మాగాణి, మిగిలిన దానిలో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఆరుతడిలో ప్రధానంగా మిర్చి, మొక్కజొన్న వంటివి ఉండగా వర్షాధారంగా వేసే శనగ, పొగాకు, పత్తి పంటలకు ఆ నీటిని పెట్టుకుంటారు. తద్వారా పంటలతోపాటు పాడి పరిశ్రమకు సాగర్ నీరు ఉపకరిస్తుంది. అలాగే అత్యధిక ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా సాగర్ నీటితోనే తీరుతుంది. అయితే గత ఏడాది కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వర్షాలు లేక సాగర్ డ్యాం నిండక ఆయ కట్టుకు నీరు రాలేదు. మాగాణి ప్రాం తంలో ఏపం టా సాగు చేసే వీలు లేక బీళ్లుగా వదిలేశారు. ఆరుతడి భూముల్లో వర్షాధారంతో కొంత మేర సాగు చేశారు. తాగునీటికి కూడా సక్రమంగా నీరందించిన పరిస్థితి లేదు.

883 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

ఈ ఏడాది తొలకరిలో కాస్తంత మెరుగ్గా వర్షం కురిసినప్పటికీ అనంతరం బెట్ట వాతావరణం కొనసాగింది. దీంతో ఖరీఫ్ ముందుకు సాగలేదు. సీజన్ ప్రారంభమై రెండు మాసాలు పూర్తయినా సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లలో కేవలం 16.80శాతంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. రైతులు భవిష్యత్ పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో కృష్ణా ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించారు. గతంతో పోల్చుకుంటే దాదాపు నెల రోజులు ముందుగానే శ్రీశైలంకు వరద నీరు రాక ఆరంభమై వారం క్రితమే గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతుండగా సాగర్ డ్యాం కూడా నిండుతోంది. ప్రస్తుత పరిస్థితిని చూస్తే శ్రీశైలం డ్యాం నీటి మట్టం 885 అడుగులు, నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 883 అడుగులకు నీటిమట్టం చేరి 204 టీఎంసీలు నిల్వ ఉంది. సుమారు 4.02 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తుండగా పది గేట్లు ఎత్తి మొత్తం దిగువకు వదులుతున్నారు. ఇక సాగర్ డ్యాం నీటి మట్టం 590 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి మట్టం 573 అడుగులు, నిల్వ 264 టీఎంసీలుగా ఉంది. ఎగువ నుంచి 3.15 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుండగా సోమవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది. దీంతో సోమవారం సాయంత్రం సాగర్ గేట్లను కూడా ఎత్తే అవకాశం ఉంది.

ముందస్తుగానే సాగునీరు విడుదల

తొలుత ఆగస్టు ఆఖరుకు సాగర్ కుడి కాలువ పరిధిలో జోన్-1కు, సెప్టెంబరు 15నుంచి జోన్2 (ఉమ్మడి ప్రకాశం జిల్లా) ప్రాంతానికి సాగు నీటిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో సాగుకు 57 టీఎంసీలు, తాగునీటికి 12 కలిపి 69 టీఎంసీలు అవసరంగా జిల్లా అధికారులు అంచనా వేశారు. కాగా దాదాపు నెల రోజులు ముందుగానే డ్యాంలు నిండటంతో జోన్-1కు తక్షణం నీటిని విడుదల చేసేలా ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మరో 15 రోజుల్లోపుగానే జిల్లాకు కూడా నీరు రానుంది. సాగర్‌డ్యాం నిండి గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో ఇంకా ముందుగా కూడా నీరు కాలువలకు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సాగర్ నీటిపై పూర్తి ఆశతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు

మద్యం షాపుల సిబ్బందికి కాసుల పంట

కొత్త ప్రభుత్వంలోనూ మారని సిబ్బంది తీరు

పట్టించుకోని అధికారులు



అద్దంకి, ఆగస్టు 4 : మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. జగన్‌రెడ్డి హయాంలో నిర్వహించిన మద్యం షాపుల సిబ్బంది మరింత బరితెగించి అదనంగా డబ్బులు తీసుకొని బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు సైతం కాసులకు కక్కుర్తి పడి బెల్ట్‌షాపులను మరింత ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో పోలీస్, ఎస్‌ఈబీ అధికారులు ఒకింత దృష్టి పెట్టి బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు న మోదు చేశారు. దీంతో కొద్దిమేర గాడిలో పడింది అనుకుంటున్న తరుణంలో మరలా యధావిధిగా తెరుచుకున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో మద్యం షాపులలో పనిచేసే సిబ్బంది ఒకింత అక్రమాలు చేయడానికి ఒకింత భయపడ్డారు. అయితే ఇంకా కొత్త మద్యం పాలసీ అమలులోకి తేకపోవడంతో పాత ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది, సూపర్‌వైజర్‌లు అత్యధిక శాతం వైసీపీ నేతలు, సానుభూతి పరులే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలాగూ కొత్త పాలసీ అమలులోకి వస్తే ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండవని, అదే సమయంలో ఎలాగూ తమను మరలా ఉద్యోగాలలోకి తీసుకోరనే ఉద్దేశంతో మరింత బరితెగించి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో బెల్ట్ షాపులకు సిబ్బందే నేరుగా సరఫరా చేస్తున్నారు. ఒక్కో బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా అమ్మి డబ్బు చేసుకుంటున్నారు. దీంతో బెల్ట్ షాపులలో రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం లభిస్తోంది. ఇక బెల్ట్ షాపులను కట్టడి చేయాల్సిన ఎస్‌ఈబీ సిబ్బంది నెల వారీ మామూళ్లకు అలవాటు పడి మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్కో బెల్ట్ షాపు నుంచి ఎస్‌ఈబీ సిబ్బంది రూ.5 వేల నుంచి రూ.10వేల మేర నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 500కు పైగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. లక్షల రూపాయలను నెలవారీగా ఎస్‌ఈబీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. దీనిని అదునుగా చేసుకున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక్కో బాటిల్‌కు కనీసం రూ.50చొప్పున అదనంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విచ్చలవిడిగా మద్యం దుకాణాలలో మద్యం అమ్మకాలు జరుగుతుండడం, అదనంగా డబ్బులు వసూలు చేయడంపట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్యం బెల్ట్ షాపులను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

టీచర్లకు 8 వరకూ సెలవుల్లేవు!

- పాఠశాల విద్య కమిషనర్ ఆదేశం
- ఎస్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

ఒంగోలు (విద్య),ఆగస్టు 4 : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నికల నేపథ్యంలో ఈనెల 8 వరకూ ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయవద్దని పాఠశాల విద్య కమిషనర్ విజయరామారాజు ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్‌ఎంసీ ఎన్నికలకు ఈనెల 1న నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి అదేరోజు వాటిని పరిష్కరించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఈనెల 8న ఎన్నికలు నిర్వహిస్తారు. మొదట ఎస్‌ఎంసీ సభ్యులను ఎన్నుకుంటారు. వారు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆతర్వాత కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ప్రధానోపాధ్యాయుడే నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలు ముగిసే వరకు టీచర్లకు సాధారణ, ఇతర సెలవులు ఏవీ మంజూరు చేయవద్దని కమిషనర్ ఆదేశించారు.

నారాయణస్వామికి భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 4: మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు అర్చకులు అభిషేకాలు చేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజల చేశారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజూ క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

DISTANCE EDUCATION

గీతం డిగ్రీ కాలేజి, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఆర్ట్రైట్ స్టడీ సెంటర్ నందు B.A, BBA, B.Com, B.Lisc, MA(ALL), M.Com, MHRM, MSW కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఒంగోలు. సెల్: 98491 24970.

AJO-200101

అమ్మబడును

తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు సిటీలో రన్నింగ్ హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, హాస్టల్స్ & ప్లాట్లు, ఖాళీ స్థలాలు, ఇళ్లులు అమ్మబడును. సంప్రః 97042 50705.

AJO-200007

సేల్స్‌మెన్స్ కావలెను

ప్రముఖ సిగిరెట్ కంపెనీలో పనిచేయుటకు సేల్స్‌మ్యాన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్‌సెంటీవ్స్ ఇవ్వబడును. అర్హత : 10th (or) Inter, వెంటనే సంప్రః 8297879291.

AJO-200102

WANTED

ఉమ్మడి ప్రకాశం జిల్లా పూర్చూరు (మం) బొబ్బేపల్లి (గ్రా)లో ఇంటి వద్ద సహాయకురాలుగా ఉండుటకు చదువుకున్న హిందూ యువతి కావలెను. అర్హతను బట్టి జీతం 10,000 నుండి 12,000 వరకు ఉండును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 72931 99999.

AJG-191780

WANTED IMMEDIATELY

1) సైటు సూపర్‌వైజర్, 2) సైటు ఇంజనీర్స్ గా మా కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవము కలిగిన అభ్యర్థులు వెంటనే కావలెను. విద్యార్హత, 1). ఏదేని డిగ్రీ / ఇంటర్, 2). B.Tech Civil or Diploma Civil, Contact సెల్: 9948260744

AJO-190200

WANTED

ప్రకాశం జిల్లా, శింగరాయకొండలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ నందు ఇంగ్లీష్, హిందీ, తెలుగు మరియు సోషల్ బోధించుటకు ప్రైమరీ టీచర్స్ కావలెను. అర్హులైనవారు సంప్రః సెల్: 7095767709

AJO-285

WANTED

ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663

AJH-4211

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు | విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్రః 9985411484

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బాధితుల్లో ఒకరు ఆర్టీసీ డ్రైవర్

ఆసుపత్రి వద్ద ఇరువర్గాల వాగ్వాదం

చక్కదిద్దిన పోలీసులు

చీరాలటౌన్, ఆగస్టు 4 : ఆదివారం రాత్రి చీరాల ఆర్వోబీ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌తో సహా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే ఇంకొల్లు మండలం కొనికి గ్రామానికి చెందిన పావులూరి నితిన్ చీరాల డిపో ఆర్టీసీ డ్రైవర్. అలాగే చీరాల మండలం విజయనగర్ కాలనీకు చెందిన ఉసురుపాటి అనిల్‌బాబు జియో ఫైబర్‌లో పని చేస్తున్నారు. నితిన్ విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, అనిల్ బైక్‌పై చీరాల వెళుతున్నారు. ఆర్వోబీ వద్ద ప్రమాదశాత్తు ఎదురెదురు రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న రెండు వర్గాలు హాస్పిటల్ వద్ద వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేసి చెదరగొట్టారు. దీంతో పరిస్థితి చక్కబడింది.



ప్రమాదంలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ నితిన్, అనిల్‌బాబు

సచివాలయ భవనాన్ని తెరిపిస్తాం!

‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందన

తాళ్లూరు, ఆగస్టు 4: తురకపాలెం గ్రామ సచివాలయ భవనాన్ని తెరిపిస్తామని ఏఈఎం వెంకటేశ్వరరావు తెలిపారు. కాంట్రాక్టర్ నుంచి భవనం తాళం తీసుకొని తెరిపిస్తామని పేర్కొన్నారు. తురకపాలెం సచివాలయం వినియోగంలోకి వచ్చే నా! శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్న తాధికారులు స్పందించారు. మండల ఏఈఎం వెంకటేశ్వరరావు ఇందుకుసంబంధించి అధికారులకు నివేదించారు. గ్రామ సచివాలయ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.13 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికీ రూ.27 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. కాంట్రాక్టర్‌ను అనేకమార్లు తాళం ఇవ్వమని కోరినా స్పందించలేదని, బిల్లులు రావాలని తాళం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు.



ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షిక వేడుకలు

బల్లికురవ. ఆగస్టు 4 : బల్లికురవ గ్రామంలో ఉన్న పోలేరమ్మ దేవాలయ 13వ వార్షిక వేడుకలు ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పోలేరమ్మకు గ్రామోత్సవం నిర్వహించి ప్రతి ఇంటి నుంచీ చద్దిని సేకరించి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. గ్రామస్థులు సమిష్టి కృషితో ప్రత్యేక భజనలను ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. 13 ఏళ్ల నుంచి గ్రామ దేవత అయిన పోలేరమ్మ దేవాలయ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు ఈసందర్భంగా తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..!

- శింగరకొండ దేవస్థానం ఆదాయానికి గండి
- దాతల సాయంతో రూ.30లక్షలతో దుకాణాల నిర్మాణం
- 10లో మూడింటిలోనే షాపులు
- నెలకు రూ.70వేల ఆదాయం పక్కదారి



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం .... దాతల సహకారంతో నిర్మించిన దుకాణాలు

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధిలో దాతల పాత్ర కీలకం. అయితే దాతల సహకారం తీసుకునేటప్పుడు ఉన్న శ్రద్ధ అనంతరం నిర్వహణ సమయంలో చూపకపోవడంతో ఆదాయానికి గండి పడుతుందన్న భావన భక్తులలో నెలకొంది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దక్షిణ రాజగోపురం ముందు వైపు పల్నాడు జిల్లా కోటప్పకొండ సమీపంలోని కట్టుబడిపాలెంకు చెందిన దాత ఆంజనేయులు సహకారంతో సుమారు 30లక్షల రూపాయల వ్యయంతో 10 దుకాణాలను నిర్మించి సుమారు 6 నెలల క్రితం దేవస్థానానికి అప్పగించారు. ఆ షాపులు అద్దెకు ఇచ్చేందుకు బహిరంగ వేలం పాటలు నిర్వహించి కేటాయిస్తారు. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన వేలం పాటలలో నాలుగు షాపులు మాత్రమే అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. అందులో ఓ దుకాణ నిర్వాహకుడు తాను నడుపుకోలేనని చెప్పినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుతం మూడు దుకాణాలలో మాత్రమే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మిగిలిన 7 షాపులు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో దుకాణానికి నెలకు రూ.10వేల అద్దె వచ్చే అవకాశం ఉండడంతో నెలకు 70 వేల రూపాయలు ఆదాయం కోల్పోతున్నారు. షాపులు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారాలు ముందుకు రాకపోవడానికి అసలు కారణాలు పై మాత్రం దేవాలయం అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. శింగరకొండలో దేవస్థానానికి అద్దెలు చెల్లించే దుకాణాల కంటె రెట్టింపు సంఖ్యలో ప్రైవేటు దుకాణాలు నడుస్తున్నాయి. ఎలాంటి అద్దె లేకుండా ప్రైవేటు షాపులు, తోపుడుబండ్లు నిర్వహిస్తుండడంతో పూజా సామగ్రి మొదలు అన్ని రకాల సామానులు తక్కువ ధరకే లభ్యమవుతున్నాయి. దీనికి తోడు దేవస్థానానికి అద్దె చెల్లించే దుకాణాలలో ధరల నియంత్రణ పై కూడా అధికారులు దృష్టి పెట్టకుండా ఉదాసీనంగా వ్యవహరించడం కూడా విమర్శలకు తావిస్తుంది. దీంతో ఎక్కువ మంది భక్తులు బయట వ్యాపారుల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులను తొలగింపు విషయంలో దేవస్థానం అధికారులు ఉదాసీనంగా వ్యవహరిండంతో దాతల సహకారంతో నిర్మించి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే 7 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేటు దుకాణాలను ఖాళీ చేయించి దేవస్థానం ఆధ్వర్యంలో దుకాణాలలో వ్యాపారాలు జరిగే విధంగా చర్యలు చేపట్టి దేవస్థానం ఆదాయం పెరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే దుకాణాలలో పూజా సామగ్రి మొదలు అన్ని రకాల వస్తువులను నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



తెలంగాణ నుంచి బల్లికురవకు వచ్చిన మంద

గొర్రెల మంద వలస బాట

- పొలాల పంటలు ఉండడంతో ఇక్కడకు వచ్చామంటున్న తెలంగాణ కాపరులు

బల్లికురవ. ఆగస్టు 4 : పొరుగు రాష్ట్రం నుండి గొర్రెల మందలను తీసుకుని కొందరు గత రెండు రోజుల నుండి వలస వస్తున్నారు. మా దగ్గర పంటలు సాగు చేశారని మేత లేదని అందుకే తాము ఖాళీగా ఉన్న భూములలో గొర్రెలను మేపుకొనేందుకు వచ్చామని గొర్రెల కాపరులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన గొర్రెల కాపరులు ఆదివారం పెద్ద ఎత్తున బల్లికురవ మండల కేంద్రం మీదుగా పలు గ్రామాలకు గొర్రెల మందలతో వలస వచ్చారు. రెండు మసాల పాటు గొర్రెలను మేపుకొని తిరిగి వెళతామని తమ వద్ద భూములు ఖాళీగా లేవని మాగాణి సాగు చేశారని అందుకే తాము వలస వచ్చామని కాపరులు తెలిపారు. సాగర్ కాలువ క్రింద ఉన్న భూములలో వర్షాలకు పట్టిన గడ్డిని గొర్రెలకు మేతగా మేపుకొంటామని వారు అంటున్నారు. ఒకే మారు వేల సంఖ్యలో గొర్రెలు రావటంతో ప్రజలు ఆసక్తిగా చూసి వారిని ఎక్కడి నుండి వచ్చారు అని ప్రశ్నించారు. తెలంగాణ నుండి ఆంధ్రకు వచ్చామని ఒంగోలు వరకు వెళ్లి తిరిగి స్వగ్రామాలకు వెళతామని తెలిపారు.

లారీ ఢీకొని బైకిస్టుకు గాయాలు

అద్దంకి, ఆగస్టు 4 : అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డులో రోడ్డు దాటుతున్న మోటార్‌సైకిలిస్టును లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పాతదామావారిపాలెంకు చెందిన దామా శేషగిరిరావు గత 4 దశాబ్దాలుగా ఫౌండ్రీ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం ఫౌండ్రీ వద్ద నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేషగిరిరావుకు తీవ్ర గాయాలు కాగా ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శేషగిరిరావును ఢీకొట్టిన లారీ ప్రమాదం జరిగిన తరువాత నిలపకుండా వెళ్లడంతో స్థానికులు వెళ్లి నిలుపుదల చేసి పోలీసులకు అప్పగించారు.

తహసీల్దార్‌గా నాగరాజారావు

పంగులూరు, ఆగస్టు 4 : జె.పంగులూరు తహసీల్దార్‌గా డి.నాగరాజారావు నియమితులయ్యారు. గతంలో వేమూరు తహసీల్దార్‌గా పనిచేసిన నాగరాజారావు సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లారు. తిరుపతి జిల్లా నుంచి బాపట్ల జిల్లాకు కేటాయించబడిన నాగరాజారావును జె.పంగులూరు తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులందాయి.

రేపు సర్వసభ్య సమావేశం

చినగంజాం, ఆగస్టు 4 : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు చినగంజాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఎంపీపీ అంకమ్మరెడ్డి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

లారీ-బైకు ఢీకొని ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- సంతమాగులూరులో విషాదం

సంతమాగులూరు, ఆగస్టు 4 : కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని వద్ద లారి మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన ఆదివారం జరిగింది. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన జడా బాజీ, మందలపాటి బుజ్జి ఇద్దరు బైకుపై నరసరావుపేటకు వెళ్తుండగా, నరసరావుపేట మండలం కాకాని వద్ద గుంటూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంతమాగులూరుకు చెందిన జడా బాజీ (22) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మందలపాటి బుజ్జి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదం సమాచారం గ్రామంలో తెలియడంతో గ్రామస్తుందరూ సంఘటనా స్థలానికి వెళ్లారు.

మనస్తాపంతో టాబ్లెట్లు మింగిన గర్భిణి

సాయికాలనీ(చీరాలటౌన్), ఆగస్టు 4 : భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా ఎనిమిది నెలల గర్భిణి ఎక్కువ మోతాదులో టాబ్లెట్‌లు మింగింది. ఈఘటన ఆదివారం రాత్రి చీరాల మండల పరిధిలోని సాయికాలనీలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సనందిస్తున్నారు.

ప్రమాదాలకు దూరంగా ఉండాలి



పర్యాటకులకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ శివకుమార్

రామాపురం(చీరాలటౌన్), ఆగస్టు 4 : సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే స్నానాలు ఆచరించాలని ఈపూరుపాలెం ఎస్‌ఐ శివకుమార్ పేర్కొన్నారు. వారాంతం కావడంతో రామాపురం సముద్ర తీరానికి పర్యాటకులు సహజంగానే అధిక శాతం విచ్చేశారు. ఈక్రమంలో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రమాద స్థలాలను గుర్తు చేశారు. నిర్దేశిత ప్రాంతాలను మినహాయించి ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్నవారిని మందలించారు. ఆయనతోపాటు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

ఇంకొల్లు, ఆగస్టు 4 : మండలంలోని గొల్లపాలెంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు అమ్మవారి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో పాల్గొని వైభవంగా కొలుపులు నిర్వహించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.9లక్షల విరాళం

పర్చూరు, ఆగస్టు 4 : పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థులతోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం తమ సొంత ఊరి అభివృద్ధికి సాయం అందిస్తున్నారు. ప్రస్తుతం పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పల్లా గిరిజారాయుడు తన భర్త పెద్ద సుబ్బారాయుడు జ్ఞాపకార్థం రూ.9,00,000 లక్షల విరాళం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ప్రభుత్వ న్నత ఉద్యోగిగా విధులు నిర్వహించి ప్రస్తుతం రిటైర్డ్ అయిన కూనపరెడ్డి వీరాంజనేయులు రూ.15లక్షల విరాళం ప్రకటిస్తూ తొలివిడతగా రూ.లక్ష నగదును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత నందిస్తున్న దాతలను వారు అభినందించారు. కార్యక్రమంలో కఠారి సురేంద్రబాబు, మంగళగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహం, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న గిరిజా రాయుడు



మాట్లాడుతున్న ఎస్పీ సరిత

పట్టుదల, క్రమశిక్షణతోనే లక్ష్య సాధన

మేదరమెట్ల, ఆగస్టు 4 : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని ఎస్పీ సరిత అన్నారు. ఆదివారం కొరిశపాడు మండలం దైవాలరావూరులో కిరణ్ జ్యోతి రీసెర్చి ఫౌండేషన్ 20వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తలదించుకుని చదివితే తలెత్తుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. అదే సెల్ ఫోన్‌లు చూస్తే జీవితాంతం తలదించుకోవాల్సి వస్తుందన్నారు. పుట్టిన ఊరును ఎవరూ మరిచిపోరాదన్నారు. రాజశేఖర్ పుట్టిన ఊరును గుర్తుంచుకుని ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పుట్టిన ఊరికి ఏదో చేయాలనే తలంపుతోనే గ్రంథాలయం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ఉద్యోగాలు ఏర్పాటుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతా మహాలక్ష్మమ్మ, శేషారెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం



ర్యాలీలో పాల్గొన్న అంబేడ్కర్ నగర్ వాసులు

మార్టూరు, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా ఇవ్వడంతో మార్టూరులోని అంబేడ్కర్ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి పెద్ద అండర్‌పాస్ వద్ద మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్‌నగర్ కాలనీలో పండుగ వాతావరణం ఏర్పడింది. కాలనీకి చెందిన అంబేడ్కర్ యూత్ యువకులు, బాబూ జగజ్జీవన్‌రామ్ అభిమానులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆనందంతో కోలాహలంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. బాణసంచాకాలుస్తూ, డప్పులు, వాయిద్యాలతో యువకులు అందరూ ర్యాలీగా కాలనీలో పర్యటించారు. వారికి ప్రతి ఇంటి నుంచీ మద్దతుగా కాలనీవాసులు సంఘీభావం ప్రకటించారు. దాదాపుగా కాలనీలోని ప్రతివీధిలో కృష్ణమాదిగ చిత్రపటాన్ని ఊరేగిస్తూ కార్యకర్తలు సందడి చేశారు. అనంతరం ఊగింపుగా పెద్ద అండరు పాస్ వద్దకు చేరి కృష్ణమాదిగ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులైన యువకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



వాటర్ ఫ్రిజ్‌ను అందజేస్తున్న కమిటీ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 4 : అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా అద్దంకిలోని సేవా స్ఫూర్తి కమిటీ (ఎస్ఎంసీ) 1989-90 బ్యాచ్ పదివ తరగతి పూర్వ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బధిరుల ఆశ్రమ పాఠశాలకు స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాలకు అవసరమైన వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతు మా పదివ తరగతి బ్యాచ్ విద్యార్థుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, స్ఫూర్తి కమిటీ పేరుతో అనేక సేవా కార్యక్రమాలను ఏళ్లుగా నిర్వహిస్తుందన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వాటర్ ఫ్రిజ్‌ను, వాటర్ బబుల్స్‌ను అందించామన్నారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతిని ఏర్పాటు చేశారు. గత 9 సంవత్సరాల నుంచి పూర్వ విద్యార్థులందరూ కలిసి పలు కార్యక్రమాలు చేసినట్లు రమేష్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు సేవా కార్యక్రమాలకు 36 లక్షలను ఖర్చు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సహకార్యదర్శి ధర్మవరపు వెంకటరావు, ట్రెజరర్ కొత్త శ్రీమన్నారాయణ, సభ్యులు బాలాజీ, పురుషోత్తం, నరహరి, శ్రీను, మురళి, ప్రసాద్, గురుశేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ధ్యాన మందిరాన్ని పరిరక్షించండి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 4 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీశ్రీశ్రీ భువనగిరి సుబ్బయ్య స్వామి ఆధ్యాత్మిక ధ్యాన మందిరాన్ని పరిరక్షించాలని పలువురు కమిటీ ప్రతినిధులు కోరారు. సుమారు 1940వ సంవత్సరంలో సుబ్బయ్య స్వామి స్థలంను ఆధ్యాత్మిక చింతన కోసం ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఇటీవల ఆ స్థలాన్ని కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని వివరించారు. ఈనేపథ్యంలో గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేరొన్నారు. అయినా పరిష్కారం కాలేదని చెప్పారు. దీంతోనే నిరసన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. అధికారులు ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడు కున్నారు. కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలురాదా ఎడ్ల పందేలు

ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



చీరాల హరిప్రసాద్‌నగర్‌లో ఎడ్ల పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 4 : హరిప్రసాద్‌నగర్‌లోని పేరాల పోలేమర్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల పందేలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన ఎడ్ల బండిపై ఎక్కి చెర్నాకోలా ఊపుతూ అందరినీ ఉత్సాహపరిచారు. ముందుగా పోలేరమ్మ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీలు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు.

చీరాల మండలం జాండ్రపేట శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కొండయ్యను ఘనంగా సన్మానించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

వేటపాలెం మండలం రామన్నపేట చౌడేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం పందిళ్లమ్మ తల్లి పొంగళ్లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీల ప్రతినిధులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో హనుమ, వాసవీమాత

శింగరకొండలో అరటిపండ్లతో పూజ

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం అరటిపండ్ల పూజ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం అభిషేకాలు నిర్వహించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, అర్చకులు అరటి పండ్లతో పూజ నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆషాడమాస అమవాస్య సందర్భంగా పలు రకాల పండ్లతో అలంకరించారు. మూలమంత్ర హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలలో పాల్గొన్నారు.



పవిత్ర ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ సతీమణి శిరీష

పవిత్ర ప్రార్థనల్లో ఎంపీ సతీమణి

చీరాలటౌన్, ఆగస్టు 4 : ద్వేషాలు వీడి ఇతరుల పట్ల ప్రేమగా మెలగాలని బాపట్ల ఎంపీ సతీమణి తెన్నేటి శిరీష కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె అందరినీ ఆప్యాయంగా పలకరించి చేరువయ్యారు. అభివృద్ధి కోసం తన భర్త ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని వివరించారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే యామినీబాల, స్థానిక నాయకులు నాగేశ్వరరావు, సైమన్, సుధాకర్, రమేష్, జయకుమార్, రత్నం, శరత్ ఉన్నారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

మార్టూరు ఎస్‌హెచ్‌వో శేషగిరిరావు



మాట్లాడుతున్న శేషగిరిరావు

మార్టూరు, ఆగస్టు 4 : చట్టవ్యతిరేక పనులకు పాల్పడేవారిపై కఠిన చర్య లు తప్పవని మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్.శేషగిరిరావు హెచ్చరించారు. మార్టూరు స్టేషన్ హవుస్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన శేషగిరిరావు ఆదివారం స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమన్నారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. 14 ఏళ్ల కిందట ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన తనకు మండలంపై అవగాహన ఉందన్నారు. ఫిర్యాదులు, సమస్యలపై వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలు లేకుండా ప్రత్యేక చొరవ చూపుతామని శేషగిరిరావు స్పష్టం చేశారు.

ఏలూరి కంటి వైద్య శిబిరానికి స్పందన

- 1100 మందికి సేవలు
- 475 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సూచన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 4 : ప్రజా సేవే లక్ష్యంగా లక్ష మందికి కంటి చూపు అందించాలనే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వైద్య సేవలు అందిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏలూరి చారిటబుల్, నోవా ఆగ్రిటెక్ ఆధ్వర్యంలో గుంటూరు శంకరకంటి ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఉచిత మోగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుంచి ప్రాంగణంలో రోగులు బారులు తీరారు. ఏలూరి ఆదేశాల మేరకు పురుషులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. 1100 మందికి పైగా రోగులకు ఉచితంగా రక్త, బీపీ, షుగర్ కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 475 మంది రోగులకు కంటి శాస్త్ర చికిత్సలకు సూచించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారకరామారావు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలందించుటలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సాటిలేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల నెలనెలా వైద్య శిబిరాలను నిర్వహిస్తూ కంటి వెలుగు ప్రదాతగా నిలిచారన్నారు. ప్రజల అభిమానాన్ని చురగొన్నారన్నారు. సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారన్నారు. లక్షమందికి కంటి చూపునందించడం లక్ష్యంగా ఏలూరి చారిటబుల్ ట్రస్టు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు మార్క్, బేతపూడి సురేష్, వీరగంధం ఆంజనేయులు, హనుమ య్య, పేర్ని బాపయ్య, ఆయోషా బుజుడే, చెరుకూరి రమేష్‌బాబు, దేవతోటి నాగరాజు, సాంబయ్య,శివయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు